

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 31.12.2025 | సంపుటి : 2 | సంచిక :325 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 31.12.2025 | volume : 2 | Issue : 325 | Pages : 8 | Cost : 2/- |




## గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు.. జనవరి 22న తీర్పు

హైదరాబాద్: గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతోపాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరు వైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం జనవరి 22న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. టీజీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల

-మిగతా 2 లో..

# ప్లాస్టిక రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు

## ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

## చెత్త, కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్

చెత్త ఏరివేతకు వారినికి మూడ్రోజులు స్పెషల్ డ్రైవ్

నాలాలు, చెరువుల ఆక్రమణలు కాకుండా చూడాలి

జనవరి నుంచి నాలాల పూడికతీత

గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి

జోనల్ కమిషనర్లకు సిఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం



02

ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

## పాలమూరు-రంగారెడ్డిపై కేసీఆర్ మాట్లాడుతారా?

### అసెంబ్లీకి మళ్లీ వస్తారా?

రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఇదే చర్చ

2న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ



హైదరాబాద్,డిసెంబరు 30 : కేసీఆర్ తొలిరోజు అసెంబ్లీకి వచ్చారు. మళ్లీ వస్తారా అని అందరి అభిప్రాయంగా ఉంది. అసెంబ్లీలో ఆయన మాట్లాడితే చూడాలని కూడా చాలాంది అభిప్రాయంగా ఉంది. కెసిఆర్ మీడియా ముందుకన్నా, అసెంబ్లీలో తన వాణి వినిపించి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నారు. 2న తిరిగి అసెంబ్లీ సమావేశం కానుంది. అయితే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా

-మిగతా 2 లో..

## ఆన్‌లైన్‌లో అశ్లీల కంటెంట్ తొలగించండి

### సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం వార్నింగ్

న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో అశ్లీల, అభ్యంతరకర కంటెంట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్యకర, అశ్లీల కంటెంట్‌పై కఠినంగా వ్యవహరించాలని సామాజిక మాధ్యమాలు, ఇతర ఆన్‌లైన్ వేదికలకు స్పష్టం

-మిగతా 2 లో..



## ఇది సంస్కరణల సంవత్సరం

### ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2025 రివైండ్

దిల్లీ: 2025 చివరకు వచ్చేసింది. ఇంకొన్ని గంటల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నాం. ఈ సందర్భంగా ఈ ఏడాది భారత ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుర్తుచేసుకున్నారు. ఇది సంస్కరణల సంవత్సరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో

-మిగతా 2 లో..



## సంక్రాంతికి ఎన్‌హెచ్ 65పై రద్దీ లేకుండా చేయాలి

### విజయవాడ రహదారిపై కన్నేయండి

### సంక్రాంతి రద్దీ లేకుండా ప్లాన్ చేయండి

అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన

సంక్రాంతి నేపథ్యంలో జాతీయ రహదారులపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఏటా సంక్రాంతి ముందు ఈ రహదారిపై వాహనాల రద్దీ వల్ల ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, డిసెంబర్ 30 : గతంలో ఎదురైన అనుభవాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ అంశంపై దృష్టి పెట్టారని చెప్పారు. హైదరాబాద్-విజయవాడ హైవేపై జనవరి

-మిగతా 2 లో..





## తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

అర్థరాత్రి నుంచే ప్రత్యేక దర్శనాలు

భారీగా తరలివచ్చిన ప్రముఖులు

సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనం

తిరుమల, డిసెంబరు 30 : తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి

-మిగతా 2 లో..

## రైతులు ఆందోళన చెందవద్దు

యూరియా సరఫరా కొనసాగుతోంది

47.68 లక్షల సంచుల యూరియా నిల్వలు

కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా

హైదరాబాద్,డిసెంబర్ 30: జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇచ్చిన ఆదేశాలనుసారం అన్ని జిల్లాలలో ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేపట్టారు. అదేవిధంగా

-మిగతా 2 లో..






| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 147 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 174 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 252 (కిలో) |
| స్కిన్ లెస్ | 287 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹92

## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు

### దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండగకు దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే ప్రకటించిన రైళ్లకు అదనంగా మరో 11 ట్రైన్లను నడపనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 7 నుంచి 12వ తేదీ మధ్య కాకినాడ-వికారాబాద్, వికారాబాద్-పార్వతీపురం, పార్వతీపురం-వికారాబాద్, పార్వతీపురం-కాకినాడ టౌన్, సికింద్రాబాద్-పార్వతీపురం, కాకినాడ



-మిగతా 2 లో..



## క్రైమ్ రేటును బాగా తగ్గించ గలిగాం

పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం

ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ

మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం

2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్ రెడ్డి







## తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల నియామకం

### డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా, తలసాని

బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కెసిఆర్

హైదరాబాద్, డిసెంబరు 30 : తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు,

-మిగతా 2 లో..

# 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్'లో భారత్ ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)



ప్రారంభించింది. ఈ ఏడాది వివిధ రంగాల్లో తీసుకొచ్చిన గణనీయమైన మార్పులు.. దేశాభివృద్ధికి మరింత ఊతమిచ్చాయి. వికసిత్ భారత్ నిర్మాణానికి ఇవి దోహదపడుతున్నాయి" అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. జీఎస్టీ సంస్కరణలు, బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐ, లేబర్ కోడ్‌లు, న్యూక్లియర్ ఎనర్జీ కోసం శాంతి చట్టం, 'వీబీ జీ రామ్ జీ' వంటి ఘటనలను ప్రధాని ఈ సందర్భంగా ఉదహరించారు. వస్తు సేవల పన్నులో రెండు శ్లాబులను తొలగిస్తూ కీలక సంస్కరణలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 5శాతం, 18శాతం శ్లాబులను అమలు చేస్తున్నారు. దీని వల్ల కోట్లాది కుటుంబాలపై భారం తగ్గడమే గాక, గిరాకీ పెరిగిందని మోదీ గుర్తుచేశారు. ఇక, ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.12లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం.. వేతన జీవులకు ఊరట కల్పించడంతో పాటు మార్కెట్లో వినిమయాన్ని పెంచిందని తెలిపారు.

# యూరియా సరఫరా కొనసాగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి సూచన మేరకు జెడి,ఎడిఎలను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన వ్యవసాయశాఖ డైరెక్టర్, వారు వారికి కేటాయించిన జిల్లాలలో పర్యటించి ప్రత్యక్షంగా యూరియా సరఫరాలను పర్యవేక్షించనున్నారు. రబీ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నుండి అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అంటే 47.68 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా రాష్ట్రంలో పూర్తిగా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలి అని మంత్రి కోరారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా యూరియా నిల్వల వివరాలను వ్యవసాయ శాఖ విడుదల చేసిందని, అన్ని జిల్లాల్లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎరువుల సరఫరా వ్యవస్థను క్రమబద్ధంగా నిర్వహిస్తోందని, రబీ సీజన్ మొత్తం యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు, రైతులకు అవసరం ఉన్నంత మేరకు యూరియా సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# అదుపులోనే శాంతిభద్రతలు

**హైదరాబాద్, డిసెంబర్ 30 :** తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఇటీవలి మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కూడా శాంతి భద్రతలు కాపాడి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూశామని డీజీపీ అన్నారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పోలీసులు సమర్థంగా పనిచేశారని అన్నారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా , తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా షికా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33శాతం క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరవుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13 తగ్గిందని, కిడ్నాప్‌లు 10, వేధింపులు కేసులు 9 తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23 రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు డిజిపి తెలిపారు.

# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

**హైదరాబాద్, డిసెంబరు 30 :** ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబ ద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమా వేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశర చేశారు. క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే అని స్పష్టం చేశారు. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశించారు. మంచి ఫలితాలు రాబట్టాలంటే ..జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానిం చారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డు లుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టా లెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిం దని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరిం చాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటు న్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చాలని దిశానిర్దేశంచేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొ ద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించా రు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకో వాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహిం చాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ఎ÷–లాన్ రూపొం దించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి మళ్లీ వస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. కేవలం కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. ఆయనకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సోమవారం ఎట్టకేలకు శాసనసభలో వచ్చి కూర్చున్నారు. సభలోకి వచ్చిన కొద్ది నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. అయితే, ఆయన చర్య గులాబీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. వెంటనే ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కేసీఆర్ తిరిగి కొత్త సంవత్సరం రెండో రోజు నుంచి జరిగే సమావేశాలకు వస్తారా? లేదా? అనే కొత్త చర్చ రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. కేసీఆర్ తప్పకుండా సభకు వస్తారని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై మాట్లాడతారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నాయి. ఎందుకంటే కెసిఆర్ వస్తారని, మాట్లాడుతారని గతకొంత కాలంగా హరీష్ రావు, కెటిఆర్ఉ చెబుతూ వచ్చారు. సోమవారం కేసీఆర్ శాసనసభకు రావడం ఖరారు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయమే పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. దాంతో అక్కడంతా హడావుడి కనిపించింది. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయన మొదట అసెంబ్లీ లాబీలో తనకు కేటాయించిన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడే సభకు సంబంధించిన హాజరు నమోదు పత్రంలో సంతకం చేశారు. తర్వాత అసెంబ్లీ హాల్లోకి వెళ్లి కూర్చున్నారు. కొద్ది నిమిషాల్లోనే తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై చర్చ జరుపుదామని, కేసీఆర్ సభకు రావాలంటూ ఈ మధ్యకాలంలో అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనవరి రెండు లేదా మూడో తేదీన కేసీఆర్ శాసనసభకు వస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీలో చర్చించే అంశాలపై స్పష్టత వచ్చాక, చర్చించే అంశాలను బట్టి కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా, గత ప్రభుత్వాల ప్రతిపాదనలు, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తీసుకున్న నిర్ణయాలపై కేసీఆర్ మాట్లాడతారని సమాచారం. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి వల్ల రెండు జిల్లాల రైతులకు ఎలాంటి నష్టం జరగనుందో కేసీఆర్ ప్రస్తావిస్తారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల తర్వాత ఇదే అంశంపై క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసి, ప్రజల్లోకి వెళ్తారని అంటున్నారు. రెండు అంశాలపై అసెంబ్లీ వేదికగా ఏం చెప్పాలి? ఇప్పటివరకు ఎదురైన ఇబ్బందులు, భవిష్యత్‌లో ఏర్పడే ప్రమాదాలు వంటి వాటిపై కేసీఆర్ సంబంధిత నిపుణులతో చర్చలు జరుపుతూ సన్నద్ధం అవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే విపక్షనేతగా ఈ రెండేళ్ల కాలంలో అసెంబ్లీలో కెసిఆర్ ఎక్కడా కనిపించలేదు. కేవలం సంతకం పెట్టి వెళ్లిపోయారు. కనీసం ఇప్పుడైనా రాకుటే ఇక బిఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం కూడా కానరాదు.

# ఆన్‌లైన్‌లో అశ్లీల కంటెంట్ తొలగించండి

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. లేదంటే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అసభ్యకర, అశ్లీల, అనుచిత, చట్టవిరుద్ధ కంటెంట్‌పై సామాజిక మాధ్యమ వేదికలు కఠినంగా వ్యవహరించడం లేదని ఐటీ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ప్రకారం థర్డ్‌పార్టీ సమాచారాన్ని ఆయా వేదికల్లో అప్‌లోడ్, ప్రచురణ, లేదా వ్యాప్తి చేస్తే.. అందుకు సామాజిక మాధ్యమ సంస్థలు సహా ఆయా ప్రచురణ వేదికలదే బాధ్యత అని గుర్తుచేస్తున్నట్లు అడ్వైజరీలో పేర్కొంది. నిబంధనలు పాటించకుంటే.. ఐటీ యాక్ట్, బీఎన్ఎస్ సహా ఇతర చట్టాల కింద ఆయా వేదికలు, సంబంధిత సంస్థలు, వినియోగదారులకు తీవ్ర పరిణామాలు తప్పవని ఉద్ఘాటించింది.



# తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

(మొదటిపేజీ తరువాయి)

ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణెళిష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

# బిఆర్ఎస్ అసెంబ్లీ లీడర్ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారిని బీఆర్ఎస్ ఎ÷–లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారిని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

టౌన్–వికారాబాద్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఆయా రైళ్లలో 1ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ కోచ్‌లతో పాటు సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటాయయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఆయా రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని పేర్కొంది. రైళ్ల వివరాలు ఇవీ..



# విజయవాడ రహదారిపై కన్నేయండి

(మొదటిపేజీ తరువాయి)

8 నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు లక్ష వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. బుధవారం తూప్రాన్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. ప్రధానంగా ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ఈ ప్రాంతాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌జామ్ కావడానికి వీల్లేదు. పండగ రద్దీ ఉన్నన్ని రోజులూ రోడ్లు మూసేయొద్దు. భారీ యంత్రాలతో పనులు చేపట్టవద్దు. అత్యవసరమైనవి అయితే ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. రోడ్లపై మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలను పూర్తిగా తొలగించాలి. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోటా పగలు, రాత్రి స్పష్టంగా కనిపించేలా ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై–విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించేలా ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ఎ÷–లాజాల వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.



## సంక్రాంతికి టోల్ ఫీజు మినహాయించండి

సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై టోల్ ఫీజు లేకుండా రవాణాకు అనుమతివ్వాలని తెలంగాణ ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. జనవరి 9 నుంచి 14 వరకు హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో, జనవరి 16 నుంచి 18 వరకు విజయవాడ–హైదరాబాద్ రూట్‌లో.. టోల్ రుసుము లేకుండా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కోరారు. సంక్రాంతి పండుగ రోజుల్లో 200శాతం అధికంగా ట్రాఫిక్ రద్దీ ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. టోల్ గేట్ల వద్ద వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు వీలుగా అనుమతివ్వాలని కోరారు.

# గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు..

## జనవరి 22న తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు. మూల్యాంకనంలో అవకతవకలు జరగకూడదన్న లక్ష్యంతో ఇద్దరి చేత చేయించారని తెలిపారు. పరీక్ష కేంద్రాల పెంపు, పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు హాల్‌టికెట్లను వేర్వేరుగా జారీ చేసిందని చెప్పారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగిందని ఎలాంటి ఆరోపణలు లేవని వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షల్లో అర్హత సాధించలేనివారు కోర్టును ఆశ్రయించారన్నారు. రెండు హాల్‌టికెట్లు ఉంటాయని పరీక్షలకు ముందే వెల్లడించినా అప్పుడు అభ్యంతరం చెప్పకుండా, ఫలితాలు విడుదలయ్యాక పిటిషన్ వేయడం చెల్లదన్నారు.

# ముక్కోటి ఏకాదశి సందడి

- యాదాద్రికి పోటెత్తిన భక్త జనం
- ఉత్తరద్వార దర్శనం చేసుకున్న ప్రముఖులు



**హైదరాబాద్, డిసెంబరు 30 :** ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు కిక్కిరిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు చేరుకుంటున్నారు. తెలంగాణలో యాద్రాద్రి, భద్రాచలం, ధర్మపురి, చిలుకూరి బాలాజీ సహా పలు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఇక, ఏపీలోని తిరుమల, సింహాద్రి అప్పన్న ఆలయం, ద్వారకా చినతిరుమల సహా వివిధ ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు వివిధ ఆలయాలను దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భద్రాచలం రామాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున స్వామివారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై శ్రీ రాముడు,గజ వాహనం పై సీతమ్మ,హనుమద వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. యాదాద్రిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇచ్చిన లక్ష్మీ నరసింహ స్వామి వారిని చూడటానికి భారీగా భక్త జనం తరలి వచ్చారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఈవో వెంకట్రావు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామునే గోదావరిలో స్నానమాచరించిన భక్తులు ఆలయానికి తరలివచ్చారు. హైదరాబాద్‌లో టిటిడి ఆలయాల్లో రద్దీ కనిపించింది. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలిచ్చారు. హిమాయత్ నగర్, జూబ్లీహిల్స్ వేంకటేశ్వరాలయంలో భారీగా ఏర్పాట్లు చేశారు. వనపర్తి జిల్లాలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. ముఖ్యంగా వరంగల్ బట్టల బజార్, వందపీట్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ధర్మసాగర్ మండలం చిల్పూర్ బుగులు వేంకటేశ్వరస్వామి, నర్సింహులపేట వేంకటేశ్వరస్వామి ఆలయాలు సహా పలు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అధికారులు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



## అక్రిడిటేషన్ల గడువు మరో 2నెలలు పొడిగింపు

- జివో 252తో జర్నలిస్టులకు అన్యాయం
- మంత్రి పొంగులేటిని కలిసిన యూనియన్ నేతలు

**హైదరాబాద్, డిసెంబర్ 30 :** అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతో పాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలా వుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. ఈ మేరకు సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

## శ్రీశైలంలో ఏకాదశి దర్శనాలు

### ప్రముఖుల రాక

**శ్రీశైలం, డిసెంబరు 30 :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలి వచ్చి శ్రీశైలం మల్లన్నను దర్శించుకుంటున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు కూడా స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పాలకమండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టిం ది. ఈ నేపథ్యంలోనే శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయ పాలకమండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. చెంచు గిరిజనులకు ఉచితంగా స్పర్శ దర్శనం అందించే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించింది. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రత్యేక దర్శనంలో భాగంగా సుమారు 100 మంది చెంచు గిరిజనులు మల్లికార్జునస్వామిని స్పర్శ దర్శనం చేసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి చారిత్రకం గా, ఆధ్యాత్మికంగా చెంచు గిరిజనులతో విడదీయరాని అనుబంధం ఉంది. శ్రీశైలం అరణ్య ప్రాంతంలో నివసించే చెంచులు ఆదికాలం నుంచి ఈ క్షేత్రానికి సంరక్షకులుగా, సేవకులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. వారి సంప్రదాయాలు, ఆచారాలకు గౌరవంగా ఆలయ పాలక మండలి ఈ నిర్ణయం తీసుకోవడం భక్తుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థా నం బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు మాట్లాడారు. చెంచు గిరిజనులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలలో ఒకరోజు వారికి ఉచితంగా మల్లికార్జున స్వామి స్పర్శ దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆలయ మొదటి పాలక మండలి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో చెంచు గిరిజనులు ఈ అవకాశాన్ని దేవుడి వరంగా భావిస్తూ, దేవస్థానం పాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇంతకాలంగా ఉన్న కోరిక నెరవేరిందని భావోద్వేగంగా స్పందించారు. శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో చెంచు గిరిజనులకు ఉచిత స్పర్శ దర్శనం ప్రారంభం కావడం ఒక చారిత్రక నిర్ణయంగా నిలిచింది.



## దుర్గమ్మను దర్శించుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి

**విజయవాడ, డిసెంబరు 30 :** దుర్గమ్మ వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. మంగళవారం ఉదయం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువదీరిన దుర్గమ్మ వారిని డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదంతోపాటు చిత్ర పటాన్ని ఆయనకు ఆలయ అధికారులు అందజేశారు. ఆ తర్వాత వేద పండితులు ఆయన్ని ఆశీర్వదించారు. ఆలయం బయట అనిల్ రావిపూడి విలేకర్లతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండగకి మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వర ప్రసాద్ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. ఈ సినిమా ఇప్పటికే పూర్తయిందని.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుందని వివరించారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ పాడిన పాట.. ఈ చిత్రానికే హైలెట్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. తాను గుంటూరులో చదివిన కాలేజీలో ఒక సాంగ్ రిలీజ్ చేయబోతున్నామని వివరించారు. ఈ చిత్రం బాగా వచ్చిందన్నారు. ప్రజలు ఈ చిత్రాన్ని ఆశీర్వాదిస్తారని ఆశిస్తున్నట్లు డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు.

## జలదోపిడీ జరుగుతున్న చలనం రాదా

- బనకచర్లపై ఫైల్లు కదులుతుంటే ఏం చేస్తున్నారు
- బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, డిసెంబరు 30 :** ఉద్యమ ద్రోహి, జలదోపిడి ద్రోహి అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు తెలంగాణకు ద్రోహి రేవంత్‌రెడ్డినే అని వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చిందని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆక్షేపించారు హరీశ్‌రావు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతో ఉన్న అనుబంధంతోనే తాను ఇలా మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు హరీశ్‌రావు. తెలంగాణ జలదోపిడికి సూత్రదారి ఆదిత్య నాథ్ దాస్ అని ఆరోపణలు చేశారు. తెలంగాణ ద్రోహి ఆయనేనని ఆక్షేపించారు. ఆదిత్య నాథ్ దాస్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని హరీశ్‌రావు సూచించారు.

## బెంగాల్‌లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి

### అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ



**కోల్‌కతా, డిసెంబర్ 30 :** బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తు న్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, ఢిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ పక్రియను ఇంత హడావిడిగా చేయడం కుట్ర కాదా అని అన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని దాడులు

### మరో హిందువు దారుణ హత్య

**ఢాకా, డిసెంబర్ 30 :** బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యలు కొనసాగుతున్నాయి. వరుసగా హిందువులే లక్ష్యంగా అక్కడి ముష్కర మూకలు కాల్పులకు తెగిస్తున్నాయి. దీపూచంద్ర దాస్, అమృత్ మండల్ అనే హిందూ యువకుల హత్యోదంతాలు మరవక ముందే మరో హిందువు హత్యకు గురయ్యాడు. మయమన్‌సింగ్ జిల్లాలోని ఒక కర్మాగారంలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బజేంద్ర బిశ్వాస్ (42)ను అతడి సహోద్యోగి కాల్చి చంపినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాము ఇద్దరం ఫ్యాక్టరీ బారక్‌లో సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో భద్రత కోసం ఉపయోగించే తుపాకీని బిశ్వాస్ వైపు గురిపెట్టానని.. అనుకోకుండా చేయి ట్రిగర్‌కు తాకడంతో తుపాకీ పేలి, బుల్లెట్ అతడికి తగిలిందని నోమన్ మియా పేర్కొన్నాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నోమన్ మియాను అరెస్టు చేశారు. బిశ్వాస్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న అల్లర్లలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై అల్లరిమూకలు దాడి చేసి హత్య చేశాయి. అది మరవకముందే ఇటీవల మరో హిందూ యువకుడిని రాజ్‌బరి జిల్లా పంగ్షా సర్కిల్‌లో గ్రామస్థులు కొట్టి చంపారు. తాజాగా మరో హత్య జరగడంతో ఆ దేశంలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.



## సింగరేణి బకాయిలపై శ్వేతపత్రం విడుదల

### టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్

**గోదావరిఖని, డిసెంబర్ 30 :** సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఇప్పటివరకు ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బొగ్గు అమ్మకాల ద్వారా బకాయిలు రూ. 47 వేల కోట్లకు చేరుకున్నాయని వీటిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే 24 వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని విమర్శించారు.పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో సింగరేణి సంస్థ కార్మికులకు జీతాలు చెల్లించడానికి ఓవర్ డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్రమైన రాజకీయ జోక్యంతో తమ ఇష్టం వచ్చిన రీతిలో సింగరేణి సొమ్మును వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోతున్న.. ఆ విషయంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణి నిధుల దుర్వినియోగంపై సంస్థకు రావాల్సిన బకాయిలపై సింగరేణి సంస్థ ద్వారా పూర్తి వివరాలతో కూడిన శ్వేత పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు గడిచిన రెండు సంవత్సరాల కాలంలో కార్మికులకు సంబంధించిన ఎలాంటి సమస్యలు పరిష్కారం చేయలేదని సింగరేణి సంస్థ నిర్వీర్యం అవుతున్న పట్టించుకోవడంలేదన్నారు. ఇవి చాలదన్నట్లు టీబీజీకేఎస్ పై నోరు పారేసుకుంటూ విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నాయకులు నూనె కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ నెలాఖరులోగా నల్గొండ 'ఎక్స్' రోడ్స్

### ఓవైసీ జంక్షన్ కారిడార్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలి : కమిషనర్

**హైదరాబాద్,డిసెంబరు 30 :** ఏప్రిల్ నెలాఖరులోగా నల్గొండ 'ఎక్స్' రోడ్స్?ఓవైసీ జంక్షన్ కారిడార్ ను ప్రారంభానికి సిద్ధ చేయాలనీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దక్షిణ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ సమస్యలను తగ్గించేందుకు చేపట్టిన నల్గొండ 'ఎక్స్' రోడ్స్ సైదాబాద్ ఐఎస్ సదన్ ఓవైసీ జంక్షన్ సమగ్ర అభివృద్ధి కారిడార్ పనుల పురోగతిని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మంగళవారం క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ కారిడార్‌ను ట్రాఫిక్ అడ్డంకులు లేని కారిడార్గా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 2,530 మీటర్ల పొడవు గల ప్రధాన్న ÷÷-లఓల్గ÷వర్‌ను రూ.620 కోట్ల అంచనా వ్యయంతో విధానంలో నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు కమిషనర్‌కు వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా కమిషనర్, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఏప్రిల్ నాటికి కారిడార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ముఖ్యంగా సైదాబాద్ నుంచి ధోబీఘాట్ జంక్షన్ వరకు కీలక ప్రాంతంలో ట్రాఫిక్ డైవర్షన్‌కు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు వేగంగా కొనసాగించాలని సూచించారు. కారిడార్ ప్రారంభానంతరం ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.క్షేత్ర పరిశీలనలో కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ బి.గోపాల్ పాల్గొన్నారు.

## హెూంగార్డును కారుతో ఢీ కొట్టి

### డ్రైవర్ పరారీ

**హైదరాబాద్,డిసెంబరు 30 :** ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న హెూంగార్డును కారుతో వేగంగా ఢీ కొట్టి డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో చోటు చేసుకుంది. సిగ్నల్ వద్ద ఉన్న హెూంగార్డు నయీమ్ (45)ను అటువైపుగా అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన హెూంగార్డును అక్కడున్న వారు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసినట్లు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

## న్యూ ఇయర్.. సన్నీ లియోన్ ఈవెంట్‌ను రద్దు చేయండి



**ఉత్తర్ ప్రదేశ్ :** నూతన సంవత్సర వేడుకలను చేసుకునేందుకు దేశంలో అనేక చోట్ల ఘనంగా ఏర్పాట్లు జరుగుతు న్నాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని మథురలో జనవరి 1న ఏర్పాటు చేస్తున్న న్యూ ఇయర్ వేడుకల్లో నటి సన్నీ లియోన్ పాల్గొనను న్నారు. అయితే, అశ్లీలతను ప్రోత్సహించే ఆమె కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది సాధు వులు నిరసన చేపట్టారు. శ్రీకృష్ణుడి జన్మస్థలమైన ఈ పవిత్ర ప్రదేశంలో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదని స్థానిక సాధువు సంఘాలు పేర్కొంటున్నాయి. భజనలు, ధ్యానం, ప్రవచనాలు చేసే ప్రదేశంలో ఇలాంటివి అనుమతించే ప్రసక్తే లేదని చెబుతున్నాయి. ఈ మేరకు సన్నీ లియోన్ కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు శ్రీ కృష్ణ జన్మభూమి సంఘర్ష్ న్యాస్ వినతిపత్రం అందజేసింది. ఒకవేళ నిర్వాహకులు ముందుకు వెళ్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు నటిపై ఫిర్యాదు చేస్తామన్నారు. ట్రంక్ హెూటల్‌లో నిర్వహించనున్న నూతన సంవత్సర వేడుకలకు సన్నీ లియోన్ హాజరు కానున్నారు. ప్రైవేటు కార్యక్రమానికి భారీ ప్రచారం చేస్తున్న నిర్వాహకులు.. టికెట్ల అమ్మకాలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే స్థానిక ఆధ్యాత్మిక సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# రైతులకు కలిసి రాని కాలం



**పంట పండించే రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు మొదలుకుని, యూరియా, ఇతర క్రిమి సంహారక మందులు ఇలా అనేక చోట్ల దగాపడుతూనే ఉన్నాడు. కాలం కలిసి వస్తే గిట్టుబాటు ధరల సమస్. కాలం కసలి రాకపోతే పంటలు ఎండిపోవడంతో వచ్చే కష్టాలు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల విషయంలో ఎందుకనో స్పష్టమైన విధానంలో ముందుకు రావడం లేదు. రైతుభరోసా పేరుతో బురిడీ కొట్టించడం తప్ప సకాలంలో ఎరువులు విత్తనాలు సరఫరా చేయడం లేదు. యూరియా కష్టాలు తీరడం లేదు. పంటలను సకాలంలో కొనడం లేదు. కొన్నా గిట్టుబాటు ధరలు చెల్లించడం లేదు. ఈ సమస్యలు ఎవరు అధికారంలోకి వచ్చినా తీరడం లేదు. 2025 సంవత్సరంలో రైతులకు పెద్దగా లాభం దక్కలేదు. కష్టపడ్డా గిట్టుబాటు ధరలు దక్కలేదు. అన్ని పంటలకు ఇదే సమస్య ఉంది.**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్యల కారణంగా రైతులు ఏటా చిత్తవుతున్నారు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులను, నిపుణులను కూర్చోబెట్టి చర్చించడం లేదు. ఈయేడు పత్తి, మిర్చి, వరి పంటలను అధిక వర్షాలు దెబ్బతీసాయి. వచ్చిన పంటలను అమ్ముకుందామంటే గిట్టుబాటు ధరలు రావడం లేదు. రకరరకాల కారణాలతో గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదు. పత్తిరైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గిందంటే ధరల్లో కోత విధించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొదట్లో సీసీఐకి పత్తిని విక్రయించిన చాలామంది రైతులకు మద్దతు ధర లభించలేదు. తేమ పేరిట ధర తగ్గించడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కొద్దిమంది నిల్వచేసుకుని ఇప్పుడు అమ్ముకుందామంటే సీసీఐ కోత విధించడంతో పాటు పత్తి బీబీ స్పెషల్ నుంచి మెక్‌మోడ్ కుమారిందని నెల వ్యవధిలో రూ.100కు పైగా కోత విధించారు. అయినా మద్దతు ధరకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గించి కొనుగోళ్లు చేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వానలతో ఇబ్బందులు పడి పంటను సరైన ధర వచ్చే వరకు చూసి విక్రయిద్దామంటే ఇప్పుడు నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని, ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టకుండా పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా పత్తి రైతుకు సీజన్ ఆరంభం నుంచి తిప్పలు తప్పడం లేదు. ప్రతికూల పరిస్థితుల్లో చేతికి వచ్చిన కొద్దిపాటి పత్తిని అమ్ముకునేందుకు కష్టాలు పడాల్సివస్తోంది. మొదట్లో తేమ పేరుతో మద్దతు ధర దక్కలేదు, ఇప్పుడేమో నాణ్యత లేదంటూ సీసీఐ ధరల్లో కోత విధించడంతో రైతులు నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.100కు పైగా కోత పెట్టడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ రూ.8,010 మద్దతు ధర ఇస్తుండగా, గరిష్టంగా రూ.7,800 తో మాత్రమే పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఉభయ రాష్ట్రాల్లో వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేపట్టారు.

జిల్లా కేంద్రంలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది. పత్తిలో తేమ సంగతి పక్కన పెడితే పత్తిలో నాణ్యతాప్రమాణాలు తగ్గుతున్నాయని తొలుత రూ.50 కోత పెట్టి రూ.8,060 ధరతో కొనుగోళ్లు చేపట్టారు. మళ్లీ మరోమారు రూ.50 కోతపెట్టింది. ప్రస్తుతం పత్తిలో 8 శాతం తేమ ఉంటే రూ.8,010 మద్దతు కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా, గరిష్టంగా రూ.7,800 ధర మాత్రమే పెడుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. సీసీఐ నిబంధనలతో విసుగు చెందిన రైతులు నగదు ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు రూ.7 వేలకే విక్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు తక్కువ ధరలను చూపి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను ముంచుతున్నారు. సీసీఐ నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారడంతో దిక్కుతోచని స్థితుల్లో గ్రామాల్లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కపాస్ యాప్‌లో బుక్ చేసుకుని రైతుల పేరిట భూమి కాగితాలు, ఆధార్ చూపించి లాభాలు పొందుతున్నారు. వ్యాపారులకు కొనుగోలు సెంటర్ల వద్ద కొంతమంది ఆఫీసర్లు కొమ్ముకాస్తున్నారనే విమర్శలున్నాయి. సీసీఐ తీరుతో రైతులు నష్టపోతుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసి వ్యాపారం చేసే దళారులు బాగుపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రాలో 2025 సంవత్సరం మొత్తంలో రైతు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా రాలేదు. మిర్చి ధర సగానికి పడిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాస ధర పథకం ఏమైందో తెలియదు.

పొగాకు లెటర్ ఇచ్చిన కంపెనీలు పొగాకు కొనకుండా ఎగనామం పెట్టారు. ప్రభుత్వం 6 వేలకు, 9 వేలకు కొనిపిస్తానని కేంద్రాలు తెరిచింది. ప్రభుత్వం ప్రకటించిన ధర 10 శాతం మందికి కూడా రాలేదు. అత్యధిక భాగం 3 వేలకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇంకా రైతుల దగ్గర పొగాకు ఉండిపోయింది. ఉల్లి రైతుకు కిలోకు రూపాయి కూడా రాని సందర్భాలు ఉన్నాయి, పారబోసిన సందర్భాలు ఉన్నాయి, పశువులను మేపిన సందర్భాలు ఉన్నాయి. హెక్టారుకు 50 వేలు ఎవరికి ఇచ్చారో, ఎందరికి ఇచ్చారో తెలియదు. మామిడి రైతులకు కిలో 12 రూపాయలకు కొనాలని, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ముదరా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ముదరా 190 కోట్లు తీసుకున్న ఫ్యాక్టరీలు కుమ్మక్కై కిలో రూ.3 నుండి రూ.6 మధ్యనే కోనుగోలు చేశాయి. రైతులు రోడ్లపై పారబోయడం, చెట్లను నరికి వేయడం చూశాం. కోకో రైతులకు 11.84 కోట్ల రూపాయలు ఇచ్చారు. సగం మంది రైతులకే అందాయి. ముందుగా అమ్ముకున్న రైతులు ఉసూరుమన్నారు. పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలు పెట్టినా ప్రైవేట్ వ్యాపారుల పెత్తనమే సాగింది. క్వింటాలు రూ.7710 మద్దతు ధర కాగా, రైతులు రూ.5000 నుండి రూ.6000 మధ్యనే అమ్ముకుంటున్నారు. టమోటా రైతులు పశువులు మేపుకున్న పరిస్థితి చూశాం. పప్పుసెనగ, మొక్కజొన్న అయినకాడికి అమ్ముకోవడం తప్ప ప్రభుత్వం ఆదుకున్నది లేదు. అరటికాయలు మార్కెట్‌కు తెచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని తోటలలో వదిలివేయడం, పశువులను మేపడం చూశాం. రైతులు కోల్పోయింది వేల కోట్లు, ప్రభుత్వం చెల్లించింది 201 కోట్లుగా తేలింది. మొత్తంగా పంట ఏదైనా కష్టం తప్పడం లేదు..నష్టం తప్పడం లేదు. పాలకులు మాత్రం మాటలతో సరిపెడుతున్నారు.

# నూతన సంవత్సర వేడుకల్లో క్యాబ్ సర్వీసులపై నజర్

- ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు
- ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్న పోలీసులు



**హైదరాబాద్, డిసెంబరు 30 :** నూతన సంవత్సర వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతున్న నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు కీలక విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల అనంతరం ప్రజలు ఇంటికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా క్యాబ్, ఆటో, బైక్ సేవల విషయంలో ప్రయాణికులు ఏమైన సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజరావ్ భూపాల్ విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 31వ తేదీ రాత్రి నగరంలో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యం లో క్యాబ్‌లు రాకపోవడం, ఆటో లేదా బైక్ డ్రైవర్లు చెప్పిన ప్రాం తానికి రావడానికి నిరాకరించడం, లేదా సాధారణం కంటే అధికం గా డబ్బు డిమాండ్ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందని జాయింట్ సీపీ వ్యాఖ్యానించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ఆటో, క్యాబ్, బైక్ డ్రైవర్లు అధిక చార్జీలు అడిగినా, లేదా బుక్ చేసిన క్యాబ్ రావడంలో నిర్లక్ష్యం చూపినా వెంటనే ఈ 94906 17346 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని గజరావ్ భూపాల్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల అనంతరం రాత్రి వేళ ఒంటరిగా ప్రయాణించే వారు, మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని కోరారు. న్యూ ఇయర్ సందర్భంగా నగరమంతా ట్రాఫిక్ పోలీసులు, పెట్రోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. రోడ్లపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సురక్షిత ప్రయాణానికి అన్ని చర్యలు చేపట్టామని పేర్కొ న్నారు. నూతన సంవత్సరం ఆనందంగా జరుపుకోవాలని, కానీ భద్రత విషయంలో రాజీపడవద్దని సూచించారు. వేడుకల అనం తరం మద్యం సేవించి వాహనం నడపకుండా క్యాబ్ లేదా ఇతర రవాణా సేవలను వినియోగించాలని కోరారు. అదే సమయంలో, రవాణా సేవల పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల నిర్ణయంతో ప్రయాణికులకు భరోసా కలిగిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమస్య ఎదురైనప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించవచ్చనే అవగాహన ప్రజల్లో పెరిగితే అక్రమ వసూళ్లకు పాల్పడే క్యాబ్ నిర్వాహకులకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు సైబరాబాద్ పోలీసులు తీసుకున్న ఈ చర్యలు అభినందనీయమని భాగ్యనగరవాసులు అంటున్నారు.

## దుర్గం చెరువులో ఆక్రమణలు

- మట్టితో పూడ్చి పార్కింగ్ దందా
- రంగంలోకి దిగి ఆక్రమణళ తొలగించిన హైడ్రా



**హైదరాబాద్, డిసెంబరు 30 :** నగరంలోని దుర్గం చెరువు ఆక్రమణలకు హైడ్రా అధికారులు చెక్ పెట్టారు. మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దుర్గం చెరువులో దాదాపు 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను హైడ్రా సిబ్బంది మంగళవారం తొలగించారు. చెరువులో మట్టితో నింపి వాహనాల పెయిడ్ పార్కింగ్ కోసం వినియోగించి ప్రతి నెలా రూ.50 లక్షల వరకూ అద్దెలు వసూలు చేస్తున్న దందాకు తెరదించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని ఆక్రమణలను తొలగించారు. అక్కడి వాహనాలను ఖాళీ చేయించి ప్రస్తుతానికి ఫెన్సింగ్ వేశారు. తర్వాత మట్టిని తొలగిస్తామని అధికారులు తెలిపారు. కబ్జాల పర్వంపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. ఐటీ కారిడార్‌లో ఒకప్పుడు 160 ఎకరాల మేర ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 116 ఎకరాలుగా మిగిలిపోయింది. చెరువుకు ఉత్తర దిశ మినహా.. మూడువైపులా ఆక్రమణలకు గురైంది. కబ్జాల పర్వం ఎలా సాగిందో ఎన్‌ఆర్‌ఎస్‌సీ అందించిన శాటిలైట్ చిత్రాలు కళ్లకు కడుతున్నాయి.



## సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రమేశ్ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 30 :** సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా 2005 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎం. రమేశ్, మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్, పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఆర్గనైజేషన్ ఐజీ గా పని చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడడం, పారదర్శకత, ప్రజా పోలిసింగ్, ప్రజలందరికీ నిష్పక్షపాతంగా సేవలు అందించడానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తామన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 'జీరో ఇన్సిడెంట్ డే' గా జరుపుకోవాలన్నారు.

## న్యూ ఇయర్ వేడుకలు..

### హైదరాబాద్ మెట్రో రైలు వేళల పొడిగింపు

**హైదరాబాద్, డిసెంబరు 30 :** న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డిసెంబర్ 31న హైదరాబాద్ మెట్రో రైలు సర్వీసుల సమయం పొడిగించినట్లు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ తెలిపింది. అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైలు సర్వీసులు నడుస్తాయని వెల్లడించింది. సాధారణంగా రాత్రి 11 గంటల వరకు చివరి మెట్రో రైలు నడవనుండగా.. బుధవారం ప్రారంభ స్టేషన్ల నుంచి రాత్రి ఒంటిగంటకు బయలుదేరతాయని అధికారులు చెప్పారు. మెట్రో రైలు, స్టేషన్లలో సిబ్బంది, పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రయాణికులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.





## ప్రియాంక తనయుడు రెహాన్ నిశ్చితార్థం

### జాతీయ మీడియాలో కథనాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 30 :** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఆయన ఎంగేజ్‌మెంట్ జరిగినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తన స్నేహితురాలు అవీవా బేగ్‌తో రేహాన్ నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం వీరిద్దరూ దిగిన ఫొటోను అవీవా తన ఇన్‌స్టా స్టోరీస్‌లో పంచుకున్నారు. తర్వాత అదే ఫొటోను 'హైలైట్స్' సెక్షన్‌లో ఉంచారు. దీంతో వీరి ఎంగేజ్‌మెంట్ వార్తలకు ఇది మరింత బలం చేకూర్చినట్లయ్యింది. రేహాన్-అవీవా ఏడేళ్లుగా స్నేహితులు. ఇటీవల అవీవా ముందు రేహాన్ పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా.. దానికి ఆమె ఆమోదించినట్లు సమాచారం. వీరి ప్రేమ బంధాన్ని ఇరు కుటుంబాలు అంగీకరించి నిశ్చితార్థం జరిపించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే దీనిపై గాంధీ, వాద్రా కుటుంబాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అవీవా కుటుంబసభ్యులు ఢిల్లీకి చెందినవారని, వాద్రా కుటుంబంతో వీరికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సమాచారం. రేహాన్ వాద్రా విజువల్ ఆర్టిస్ట్. వైల్డ్‌లైఫ్, స్ట్రీట్, కమర్షియల్ ఫొటోగ్రఫీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2021లో ఢిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'డార్క్ పర్సెప్షన్' పేరుతో తన తొలి ఎగ్జిబిషన్ నిర్వహించారు. అవీవా కూడా ఫొటోగ్రాఫర్. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ నుంచి జర్నలిజం అండ్ కమ్యూనికేషన్స్ పూర్తి చేశారు. ఓ ఫొటోగ్రఫిక్ స్టూడియో, ప్రొడక్షన్ కంపెనీకి సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

## గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్..

### బంజారాహిల్స్‌కు చెందిన యువతి అరెస్ట్

**హైదరాబాద్:** నగరంలో మాదకద్రవ్యాల కట్టడికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. డ్రగ్స్ పెడ్లర్లు కొత్తదారుల్లో సరఫరా కొనసాగిస్తున్నారు. తాజాగా గోవా నుంచి హైదరాబాద్‌కు భారీగా డ్రగ్స్ తీసుకొస్తున్న యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలిని బంజారాహిల్స్‌కు చెందిన హస్నాగా గుర్తించారు. 2024 డిసెంబరులో గోవా వెళ్లిన ఆమె.. అక్కడ మొదటిసారి రుచి చూసింది. ఆ తర్వాత మాదకద్రవ్యాలకు బానిసగా మారింది. కేవలం వినియోగదారురాలిగానే కాకుండా, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో డ్రగ్స్ పెడ్లర్‌గా మారినట్లు పోలీసులు వెల్లడించారు. గోవాలో నైజీరియన్ డ్రగ్ మాఫియాతో ఆమె సంబంధాలు ఏర్పచుకున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి తక్కువ ధరకు ఖరీదైన డ్రగ్స్‌ను కొనుగోలు చేసి.. హైదరాబాద్ తీసుకువచ్చి ఇక్కడి యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఏడాది మార్చి నుంచి ఆమె పలుమార్లు గోవాకు వెళ్లి డ్రగ్స్ తీసుకొచ్చినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈనెల 26న సియోలిమ్, మాపూసా ప్రాంతాల్లో ఆమె డ్రగ్స్ డీల్స్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హస్నా గతంలో కూడా గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో జైలుకు వెళ్లిన ఆమె.. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చింది. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా పద్ధతి మార్చుకోకుండా.. మరింత పకడ్బందీగా హైదరాబాద్‌కు చెందిన మరికొందరు సహచరులతో కలిసి డ్రగ్స్ దందా కొనసాగిస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. నగరంలో ఆమె ఎవరెవరికి డ్రగ్స్ విక్రయిస్తోంది? ఈ ముఠాలో ఇంకా ఎంతమంది సభ్యులు ఉన్నారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ గొలుసుకట్టు నెట్‌వర్క్‌లో ఉన్న మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



## పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దాలి

- దేశానికి దిక్సూచిగా మార్చాలి
- పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, డిసెంబరు 30 :** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్ 2026ను ఆవిష్కరించారు. అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ ? 2026 వర్క్‌షాప్‌లో అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రకృతి, వారసత్వ సంపదే తెలంగాణ బలమని చెప్పుకొచ్చారు. కొత్త అద్భుతాలు కాదని.. ఉన్న వనరులకు మెరుగులు పరిస్తే చాలని తెలిపారు. దేశీ, విదేశీ పర్యాటకులు తెలంగాణ వైపు చూసేలా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు. గ్రామీణ అద్భుతాలను నగరవాసులకు చేరవేయాలని సూచించా రు. పర్యాటక రంగంలో నూతన ఒరవడి రావాలని కోరారు. పర్యాటక అద్భుతాలను ప్రపంచానికి చూపాలని అన్నారు. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలతో పర్యాటకులను ఆకర్షించాలని చెప్పుకొచ్చారు. వసతులు, హాస్పిటాలిటీలో రాజీ పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.



## ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. నేలకొండపల్లి మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. మంగళవారం తెల్లవారు జాము నుండి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని గోవింద నామ స్మరణతో దర్శించుకున్నారు. పూజారి మధు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, చైర్మన్ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కూసుమంచి మండల కేంద్రం లోని గణపేశ్వరాలయం, జీళ్లచెరువు వెంకటేశ్వర స్వామి ఆలయం, జక్కేపల్లి బాల కోటేశ్వరాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.



## సిపిఐ వందేళ్ళ వేడుకను జయప్రదం చేయండి

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహించనున్న సిపిఐ 100 సంవత్సరాల వేడుకను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాగా హేమంతరావు పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలంలోని పల్లెగూడెం గ్రామంలో మంగళవారం సిపిఐ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న నిర్వహించాల్సిన ఈ వేడుకలను స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వేయడం జరిగిందన్నారు. కావున నిర్వహించ బోయే వేడుకలకు సిపిఐ శ్రేణులను సంఘటితం చేస్తూ ఊరురా ముమ్మర ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే ఈ వందేళ్ళ సుదీర్ఘకాలంలో సిపిఐ చేసిన పోరాటాలు, సాధించిన హక్కులను నేటి తరానికి చాటి చెప్పాలని కోరారు. ఐదు లక్షల మందితో నిర్వహించబోయే ఈ భారీ బహిరంగ సభకి ఇతర దేశాల నుంచి కమ్యూనిస్టు నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వేడుకను చూసే అవకాశం మరలా 100 సంవత్సరాల తర్వాతే వస్తుందని, అటువంటి వేడుకను చూసే భాగ్యం మన కలగడం అదృష్టంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణ కుమార్, జిల్లా సమితి సభ్యుడు పగిళ్ల వీరభద్రం, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గ్రామ సర్పంచ్ చుండూరి సృజన, నాయకులు పెండ్లి నర్సిరెడ్డి, కళ్లెం మ-ుత్తయ్య, కళ్లెం సీతయ్య, కొమరబత్తిని వెంకటరత్నం, కొమరబత్తిని అన్నమ్మ, కళ్లెం వీరయ్య, దారుమల్ల నాగయ్య, వి. రామాచారి తదితరులు పాల్గొన్నారు.





## తెల్లాపూర్ మేళ్లచెరువు కట్టను కాపాడండి

### మాజీ సాగునీటి సంఘం చైర్మన్ వడ్డే నర్సింలు

**పఠాన్ చెరువు, రాజముద్ర:** నియోజకవర్గ పరిధిలోని రామచంద్రపురం మండలం 263 వ డివిజన్ తెల్లాపూర్ లో మేళ్లచెరువు కట్టపై అతిబారి వాహనాలు తిరుగుతున్నాయి. బడా రియల్ వ్యాపారుల వాహనాలు తిరగడంతో మేళ్లచెరువు కట్ట ధ్వంసం అయ్యే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని గమనించి పరిసర ప్రాంతం గ్రామస్తులు మాజీ సాగునీటి సంఘం చైర్మన్ నర్సింలు కలిసి ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారిని కలిసి ఈ విషయాన్ని తెలుపగా, ఇటీవల కాలంలో ఇరిగేషన్ అధికారులు ఈ కట్టపై బారి వాహనాలు వెళ్ళకుండా ఒక కమాన్ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులపాటు ఈ భారీ వాహనాలు ఈ కమాన్ నుండి కాకుండా వేరే ప్రాంతం నుండి గమ్యస్థానాలకు చేరుకున్నాయి. అయితే రెండు రోజుల క్రితం ఈ కమాన్ ఒక పక్కకు ఒరిగి ఉంది. వేరే దారి నుండి వెళ్లడానికి ఇష్టపడని భారీ వాహనదారులు, ఈ కమాన్ ను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై స్పందించిన మాజీ సాగునీటి సంఘం చైర్మన్ వడ్డే నర్సింహులుమాట్లాడు తూ జిహెచ్ఎంసి ఉప కమీషనర్ కు ఇరిగేషన్ అధికారులకు తెలియజేసి ఈ కమాన్ ను యథాస్థితికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని వడ్డే నరసింహులు తెలిపారు.

## కాలబైరవ స్వామి కి సింధూర పూజలు

**రామారెడ్డి, డిసెంబర్ 16, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఈసనపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం రోజున ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు పూజారులు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామ చంద్రం, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , భక్తులు పాల్గొన్నారు.



# ప్రజల చెంతకే న్యాయం

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కె. లక్ష్మణ్
- మేడిపల్లిలో కోర్టు కాంప్లెక్స్ ప్రారంభం



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** సామాన్యులకు సత్వర న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా న్యాయవ్యవస్థ అడుగులు వేస్తోందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జస్టిస్ కె. లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మేడిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్‌ను జిల్లా కలెక్టర్ మను చౌదరి, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎస్.ఎన్. శ్రీదేవితో కలిసి ఆయన ప్రారంభించారు.

**జనవరి 5 నుండి విచారణలు:**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కోర్టుల వికేంద్రీకరణ ద్వారా న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. మేడిపల్లి లో ప్రస్తుతానికి మూడు కోర్టు హాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చామని, జనవరి 5వ తేదీ నుండి ఇక్కడ పూర్తిస్థాయిలో కోర్టు కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

**త్వరలో మరో 6 కోర్టులు**

మేడిపల్లి ప్రాంతానికి అదనంగా మరో ఆరు కోర్టులు మంజూరయ్యాయని జస్టిస్ లక్ష్మణ్ ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. వీటికి సంబంధించి త్వరలోనే భవనాల ఎంపిక, స్థల పరిశీలన పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని చెప్పారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయం అందేలా ప్రభుత్వం, న్యాయశాఖ చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు.

**బార్ అసోసియేషన్ భవనంపై సానుకూల స్పందన**

బార్ అసోసియేషన్ కోసం ప్రత్యేక భవనం కేటాయించాలని స్థానిక న్యాయవాదులు కోరగా, జస్టిస్ లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ పాత భవనాన్ని కేటాయించే అంశాన్ని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి శ్రీదేవి, కలెక్టర్ మను చౌదరితో పాటు సీనియర్ న్యాయవాదులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, శేరి సవితా రెడ్డి, పెద్ద సంఖ్యలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలను వీడాలి

### ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మంగళవారం మానసిక సమస్యలు, పరీక్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదక ద్రవ్యాల నిరోధకంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వనిత తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మానసిక వైద్యాధికారి డా రమణ, ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా మానసిక వైద్యాధికారి డా రమణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. టీనేజీ వయస్సులో విద్యార్థులు ఎదుర్కొనే అవరోధాలను వివరించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షా కాలంలో ప్రిపేర్ అవ్వాలని, మానసికంగా ఎటువంటి ఒత్తిడిని పెట్టుకోవద్దని తెలిపారు. మొబైల్ వ్యసనానికి దూరంగా ఉండాలని సూచించారు. ఎటువంటి మానసిక సమస్యలు తలెత్తినా తమను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ముఖ్యంగా టీనేజీ వయసున్న పిల్లలు మత్తుపదార్థాలకు లోనయ్యి, విలువైన జీవితాలను వృధా చేసుకుంటున్నారని, తమ ఇళ్లలో అన్నయ్యాలకు, కుటుంబసభ్యులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలపాలని వివరించారు. రామారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో డ్రగ్స్ కు బానిసైన వ్యక్తులను ఇదివరకే పట్టుకొని, తీవ్రంగా మందలించి, కౌన్సిలింగ్ అందించినట్లు విద్యార్థులకు తెలిపారు. కుటుంబాన్ని, సమాజాన్ని కాపాడాల్సిందే యువత అని అందులో మీరు కూడా భాగస్వామ్యం కావాలని విద్యార్థులకు తెలిపారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. సురేష్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ డా. రాహుల్, ఉపాధ్యాయులు పద్మ, గంగలక్ష్మి, రజిత, అరుణ, 200 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ నిధి సాయం 10000కు పెంపు

- కేంద్ర ప్రభుత్వ కీలక నిర్ణయం కోట్లాది రైతులకు లబ్ధి
- బీజేపీ జిల్లా నాయకులు సారా జగన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** దేశంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి శుభవార్త అందించిందని వికారాబాద్ జిల్లా బిజెపి నాయకులు సారా జగన్ అన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ( పీఎం కిసాన్ ) పథకం కింద రైతులకు అందిస్తున్న వార్షిక ఆర్థిక సాయాన్ని రూ. 6000 నుంచి రూ. 10000కు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ పెంపుతో దేశవ్యాప్తంగా కోట్లాది చిన్న, సన్నకారు రైతులకు ప్రత్యక్షంగా లాభం చేకూరనుందని తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం కింద అర్హులైన రైతులకు సంవత్సరానికి మూడు విడతలుగా రూ. 6,000ను నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజా నిర్ణయం ప్రకారం ఇకపై రైతులకు సంవత్సరానికి రూ. 10000ను మూడు లేదా నాలుగు విడతలుగా అందించనున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపిందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతులే దేశానికి అన్నదాతలు. వారి ఆదాయం పెరగడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. పీఎం కిసాన్ నిధి పెంపు రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో రైతులపై ఉన్న అప్పుల భారం కొంతవరకు తగ్గుతుందని, వ్యవసాయ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులకు ఈ పెంపు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. పీఎం కిసాన్ నిధి పథకం 2019లో ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు ప్రత్యక్ష నగదు సాయం అందించే అత్యంత విజయవంతమైన పథకాలలో ఒకటిగా నిలిచిందని తాజా సవరణతో రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యం మరోసారి స్పష్టమైందని వ్యవసాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు.



## పటాన్ చెరువు నాయకులూ అన్ని కార్యాలయాలు మీకేనా మాకు వద్దా

### - తెల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ నాయక్ వాడి కృష్ణ సూటి ప్రశ్న

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** గత 15 సంవత్సరాల పైబడిన కాలం నుండి పఠాన్ చెరువు ప్రాంతంలోనే అన్ని ముఖ్య కార్యాలయాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో తెల్లాపూర్ మున్సిపాలిటీతో పాటు అమీన్ పూర్ ముత్తంగి లు జిహెచ్ఎంసి లో విలీనమై డివిజన్ గా మారాయి. నూతన డివిజన్లతోపాటు పాత డివిజన్ లు కూడా తెల్లాపూర్ సర్కిల్ కార్యాలయంగా ఇటీవల కాలంలో అధికారులు మార్చారు. ఈ తెల్లాపూర్ సర్కిల్ విషయంలో పటాన్చెరువు నియోజకవర్గం నాయకులు విభేదించడం సరైన పద్ధతి కాదని స్థానిక నాయకులు వెల్లడిస్తున్నారు. ఈ విషయంలో తెల్లాపూర్ సర్కిల్ మాకు వద్దు పటాన్చెరువు సర్కిలే మాకు కావాలి అని రోజురోజుకు కొంతమంది నాయకులు బయటకు తెలుపుతున్నారు. ఈ విషయాలపై స్పందించిన తెల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ నాయక్ వాడి కృష్ణ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో నూతన డివిజన్లకు తెల్లాపూర్ సర్కిల్ గా చేయడం సబబు అని వ్యాఖ్యానించారు. ఈ సర్కిల్ ను మారిస్తే మేము కూడా రోడ్లపైకి వస్తామని తెలియజేస్తూ, ఈ సర్కిల్ అందరికీ అందుబాటులో ఉంటుందికనుక పాలన పరంగా అన్ని డివిజన్ ల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఈ మార్పును వద్దనే పద్ధతి మానుకోవాలని పటాన్చెరువు నాయకులకు హితవు పలికారు మాజీ ఉపసర్పంచ్ నాయక్ వారికి కృష్ణ. ఈ తెల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు విషయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని ఈ సందర్భంగా నాయక్ వాడి కృష్ణ కోరారు

## కొత్త సంవత్సర వేడుకల్లో ఆంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### నవాబుపేట్ ఎస్ఐ జీ.పుండ్లిక్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నూతన సంవత్సర వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగేలా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని నవాబుపేట్ ఎస్ఐ జీ. పుండ్లిక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మే-రకు మండల ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరం పేరుతో ఎలాంటి డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ డీజేలు నిర్వహించిన ట్లయితే సంబంధితులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో మండలం వ్యాప్తంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహించనున్నట్టు ఎస్ఐ వెల్లడించారు. 31వ తేదీ రాత్రి రోడ్లపై కేకులు కట్ చేయడం, బైకులను ఓవర్ స్పీడ్‌లో నడపడం, స్టంట్స్ చేయడం పూర్తిగా నిషేధం అని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై పటాకులు కాల్చడం కూడా నిషేధించబడిందని హెచ్చరించారు. డిసెంబర్ 31 ప్రతి సంవత్సరం వస్తుంది. కానీ జీవితం ఒక్కసారే అని, ఒక్కరోజు ఆనందం కోసం జీవితాన్ని పణంగా పెట్టకండి అని యువతకు ఎస్ఐ తెలియజేశారు.



## పాఠశాలను పరిశీలించిన పాలక మండలి

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** రామారెడ్డిమండలం మోషంపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను పరిశీలించారు పాలక మండలి వంట గదిలోకి వెళ్లి పిల్లలు తినే వంటశాలను పరిశీలించారు పిల్లలకు సరైన భోజనం పెట్టాలని పాలక మండలి సూచించింది సర్పంచ్ జరా లక్ష్మి రాజయ్య, ఉప సర్పంచ్ వంగ సంతోష్ రెడ్డి, వార్డు సభ్యులు రజిని, వినోద, లత, నరేష్, శివరాజు, సత్య రాజు, రాజయ్య పరిశీలించారు.



## సొంత ఖర్చులతో మట్టి రోడ్డు నిర్మాణం

### అభివృద్ధికి శ్రీకారం చుట్టిన సర్పంచ్ పాయం రామనరసయ్య

**ఆళ్లపల్లి, డిసెంబర్ 30 (రాజముద్ర న్యూస్) :** రాగాపురం గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాయం రామనరసయ్య గ్రామ అభివృద్ధి దిశగా కీలక ముందడుగు వేశారు. గ్రామ పరిధిలో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సుమారు రెండు కిలోమీటర్ల మట్టి రోడ్డు నిర్మాణాన్ని తన సొంత ఖర్చులతో చేపట్టారు. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా, పదవిలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ రామ నరసయ్య తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతంలో మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టడంతో రైతులు, గ్రామవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభివృద్ధి పనులను ఉపసర్పంచ్ పాయం రాంబాబు, వార్డు సభ్యులు గొగ్గేల రాంబాబు, గొగ్గేల రాజేందర్, సంద సురేష్‌లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, పనులు నాణ్యతతో వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గొగ్గేల కాంతారావు మాట్లాడుతూ, "ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సర్పంచ్ గోగ్గేల రామ నరసయ్య చొరవ అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి కృష్ణయ్య, గొగ్గేల శ్రీను, పాయం రామస్వామి, జి. రామ్మూర్తి, జి. నరసింహారావు తదితరులు పాల్గొని అభివృద్ధి పనులకు తమ మద్దతు తెలిపారు.



## మానవత్వం చాటుకున్న పల్లెర్ల యువకులు


**ఆత్మకూరు( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలం కోటమర్తి గ్రామానికి చెందిన వెంకటేష్ కోటమర్తి నుండి బస్సు లో భువనగిరికి వెళ్తున్నాడు ఆత్మకూరు బస్టాప్ దగ్గరికి రాగానే బీపీ పెరిగి బస్సు లో పడిపోయారు అక్కడే స్థానికంగా ఉన్న పల్లెర్ల యువకులు తుంగ మచ్చగిరి మేడి స్వామి వంగపల్లి మచ్చగిరి వెంకటేష్ ని ఆరోగ్య ఉప కేంద్రంకి తీసుకెళ్లి వారికీ వైద్యం చేయించి వారు కోలుకునే వరకు ఆలనా పాలన చూసికొని పండ్లు అందజేసి వారి బంధువులు వచ్చే వరకు అక్కడే వుండి వారికి అప్పజెప్పడం జరిగింది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**గాంధారి, రాజముద్ర న్యూస్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం గాంధారి మండలంలోని వండ్రికల్ గ్రామంలో ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మొరం, ఇటుకలు వంటి నిర్మాణ సామగ్రి ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉందని, ఈ విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు దశలవారీగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సమయానికి అన్ని గృహాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. వండ్రికల్ గ్రామంలో మొత్తం 10 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ప్రస్తుతం బేస్‌మెంట్ స్థాయి వరకు 2 ఇళ్లు, రూఫ్ లెవెల్ వరకు 1 ఇల్లు, స్లాబ్ లెవెల్ వరకు 4 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో పీడీ విజయపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ సురేందర్, ఎంఆర్‌ఓ రేణుక చౌహాన్, ఎంపీడీఓ రాజేశ్వర్, మండల స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ డీఈఈ, ఏఈలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పూర్ణచంద్రుడిని సన్మానించిన హరీష్ రావు

**ఆత్మకూర్ (ఎం) రాజమద్ర న్యూస్:** ఆత్మకూర్( ఎం) మండలం మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు ను సర్పంచుల అభినందన సమావేశంలో టిఆర్ఎస్ ప్రతిపక్ష నేత తన్నీరు హరీష్ రావు సన్మానించారు. పూర్ణచంద్ర రాజు కుటుంబం జెడ్పిటిసి గా ఎంపీపీ గా రెండుసార్లు సర్పంచ్లుగా సింగిల్ విండో చైర్మన్ గా మూడుసార్లు ఎంపీటీసీ గా గతం లో గెలుపొందారని మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి వారికి తెలిపారు ఇటువంటి వ్యక్తికి తప్పకుండా సన్మానించాలని హరీష్ రావు పూర్ణచందర్ రాజు ను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్ణ చందర్ రాజు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మండలంలో పార్టీని ఇంకా పటిష్టం చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాజీ ఎంపీటీసీ కవిత ఇంద్రారెడ్డి సర్పంచులు ధనలక్ష్మి సోమిరెడ్డి మాజీ మండల అధ్యక్షులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వీసా రూల్స్‌తో భయంభయం




## ఇళ్లకే పరిమితమైన వలసదారులు

**యూఎస్ :** అమెరికాలో ఇప్పుడు క్రిస్మస్, న్యూఇయర్ హాలీడే సీజన్ సందర్భంగా ప్రయాణాల రద్దీ విపరీతంగా ఉంటుంది. వరుస సెలవులతో అనేక మంది పర్యటనలకు మొగ్గు చూపుతుంటారు. అయితే, ట్రంప్ వీసా రూల్స్ పుణ్యమా అని వలసదారులు మాత్రం ఇళ్లకే పరిమితమవుతున్నారు. కఠిన ఇమిగ్రేషన్ నిబంధనల నేపథ్యంలో ప్రయాణాలంటేనే 'వద్దు బాబోయ్' అంటూ భయపడుతున్నారు. అమెరికాలో ఉంటున్న భారతీయులు సహా అనేకమంది వలసదారులు తమ ప్రయాణాలను మానుకుంటున్నారని న్యూయార్క్ టైమ్స్, కేఎఫ్ఎఫ్ సర్వేలో వెల్లడైంది. ఇమిగ్రేషన్ అధికారుల దృష్టిలో పడకూడదనే ఉద్దేశపూర్వకంగా ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నామని ప్రతి 10 మందిలో ముగ్గురు విదేశీ వలసదారులు చెప్పినట్లు సర్వే వెల్లడించింది. హెచ్-1బీ వీసాదారుల్లో 32శాతం మంది, అమెరికా పౌరసత్వం పొందిన విదేశీయుల్లో 15శాతం మంది కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచినట్లు సర్వే తెలిపింది. ఇక, సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న వలసదారుల్లో అయితే ఏకంగా 63శాతం మంది బయటకు ఎక్కడికీ వెళ్లకుండా ఇళ్లల్లోనే ఉంటున్నారట..! విదేశీ ప్రయాణాలు మాత్రమే కాదు.. అమెరికాలోనూ ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వలసదారులు ఇష్టపడటం లేదని సర్వే తెలిపింది. హెచ్-1బీ సహా పలు వీసాలకు సంబంధించి నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప విదేశీ ప్రయాణాలు చేయొద్దని ఇటీవల పలు టెక్ కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సూచించాయి.

## అమెరికాలో వలసలను 10 ఏళ్లు నిలిపివేయాలి

### ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్

**యూఎస్ :** అమెరికాకు 10 ఏళ్లపాటు వలసలు నిలిపివేయాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్ అన్నారు. ఇమిగ్రేషన్ వ్యవస్థలో భారీగా అవినీతి పేరుకుపోయిందని వ్యాఖ్యానించారు. శరణార్థి, క్షమాభిక్ష, ఆశ్రయం కల్పించే కార్యక్రమాలు పూర్తిగా అవినీతిమయం అయ్యాయని విమర్శించారు. ఈమేరకు తన వార్‌రూమ్ షోలో మాట్లాడారు. అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులతో కంపెనీలు ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాయని హెచ్-1బీ వీసా కార్యక్రమం గురించి పేర్కొన్నారు. వలసదారులపై కఠిన వైఖరిని అవలంబిస్తోన్న ట్రంప్ ప్రభుత్వం శరణార్థులకు, వలసదారులకు ఇచ్చే వర్క్ పర్మిట్‌ల కాలవ్యవధిని కుదిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా తీసుకువస్తోన్న కొత్త విధానాలతో హెచ్-1బీ దరఖాస్తుదారులకు కష్టకాలం ఎదురవుతోంది. వీసా అపాయింట్‌మెంట్లు వాయిదా వేయడంతో వచ్చే ఏడాది అక్టోబరు వరకు వారు ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు యూఎస్ ప్రభుత్వం పెంచింది. ఈ నేపథ్యంలోనే ఈ కార్యక్రమాలన్నింటిని సరిదిద్దాలంటూ బానన్ వ్యాఖ్యలు చేశారు.



## తెలంగాణలో శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ కేశవ్ గుప్త

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ శివసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ సమక్షంలో గ్రేటర్ హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ కేశవ్ గుప్తా ఆధ్వర్యంలో బోయ నరేష్ ని గ్రేటర్ హైదరాబాద్ యువసేన అధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవ్ గుప్తా మాట్లాడుతూ రాబోయే కార్పొరేటర్ ఎలక్షన్లలో 300 డివిజన్లో మా పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో పార్టీ బలోపేతం కానుందని తెలంగాణలో జరిగే ప్రతి ఎలక్షన్లలో శివసేన పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. శివసేన పార్టీ యువతకు పెద్దపీట వేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అవినాష్ జశ్వాల్, రాష్ట్ర కార్యదర్శి మహేష్ కుమార్ రంపాక, భద్రాచలం కొత్తగూడెం జిల్లా ఇన్చార్జిలు గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు మల్కన్ సుదర్శన్, యాకుత్పురా ఇంచార్జ్ కిరణ్, తదితర సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకల్లో డీజేలకు అనుమతి లేదు

### వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. పోలీస్ నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాల యజమానులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం సూచించిన సమయ పాలనను ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో జిల్లాలో ఎక్కడా డీజే సిస్టమ్‌లకు అనుమతి లేదని ఆమె స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్పీ ప్రజలను హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె పేర్కొన్నారు.

## నూతన సంవత్సర సందర్భంగా పేద విద్యార్థులకు సహాయం అందించాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వారు బొకేలు, పుష్ప గుచ్చాలు, శాలువాలు తీసుకొని రావద్దని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపు నిచ్చారు. నూతన సంవత్సరం సందర్బంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమని, వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, దుప్పట్లు ఇతర సామగ్రి ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పేద విద్యార్థులకు ఉపయోగ పడతాయని, వాటిని త్వర లో విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పేద పిల్లలకు విద్యా సామాగ్రి ఇవ్వడం ద్వారా పిల్లల చదువుకు ఉపయోగ పడుతాయని, చలి కాలం దుప్పట్లు అందిచడం వలన వారి ఆరోగ్యపరంగా ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు.





## స్వర్ణగిరి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**భువనగిరి. రాజముద్ర న్యూస్:** ముక్కోటి వైకుంఠ ఏకాదశీ పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం స్వర్ణగిరి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఉత్తర ధ్వారాం గుండా లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య .దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ సభ్యులు బీర్ల అయిలయ్య కి ప్రత్యేక స్వాగతం పలికి ఆలయంలోకి స్వాగతించారు.ముందుగా జల నారాయణ స్వామిని కోనేటి లో దర్శించుకున్నారు. ఆ తర్వాత ఉత్తర ధ్వారం నుండి ఆలయంలోకి ప్రవేశించి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఆ తర్వాత ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు, స్వామి వారి చిత్రపటం తో పాటు లడ్డు ప్రసాదం అందజేశారు.

# నెతన్యాహు వార్‌టైమ్ ప్రైమ్‌మినిస్టర్

### ట్రంప్ వ్యాఖ్యలు



**యూఎస్ :** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు యుద్ధకాల ప్రధాని అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. ఆయన ఇజ్రాయెల్‌ను ప్రమాదకరమైన గాయం నుంచి బయటకు తీసుకువచ్చారని, అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. అక్కడ నెతన్యాహు లాంటి ప్రధాని లేకపోయుంటే.. ఇప్పుడు ఆ దేశం ఉనికిలో ఉండకపోయేదన్నారు. ట్రంప్ పొగడ్తలకు నెతన్యాహు చిరునవ్వులు చిందించారు. ట్రంప్ వంటి మిత్రుడు ఇజ్రాయెల్‌కు మరొకరు లేరని వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు నేతలు తాజాగా అమెరికాలోని ఫ్లోరిడాలో భేటీ అయ్యారు. గాజా శాంతి ప్రణాళికలో తదుపరి దశను ముందుకుతీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఈ సమావేశం జరిగింది. గాజా కాల్పుల విరమణ ప్రణాళిక రెండో దశకు వెళ్లేముందు హమాస్ ఆయుధాలను వీడాల్సిందేనని స్పష్టం చేశారు. జనవరిలో గాజాకు నిపుణులతో కూడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ట్రంప్ ఆసక్తిగా ఉన్నారు. గాజాలో తాను చేస్తున్న శాంతి యత్నాలకు గుర్తింపు రావడంలేదని ఈ సమావేశంలో ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. ఇక, ఇరాన్ అణు, క్షిపణి కార్యక్రమాలను వేరే ప్రాంతాల్లో చేపట్టే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే జరిగితే.. ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని అధ్యక్షుడు హెచ్చరించారు.

#### ట్రంప్‌నకు ఇజ్రాయెల్ శాంతి పురస్కారం: ప్రకటించిన నెతన్యాహు

ఇరువురు నేతలు భేటీ అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "అధ్యక్షుడు ట్రంప్ ఎన్నో ఆశ్చర్యపరిచే నిర్ణయాలు తీసుకున్నారు. అందుకే 80 ఏళ్లలో తొలిసారి ఇజ్రాయెల్ జాతీయుడు కాని వ్యక్తికి శాంతి బహుమతి ఇవ్వాలని నిర్ణయించుకున్నాం" అని ఈ సందర్భంగా నెతన్యాహు ప్రకటించారు.

#### నాకు క్రెడిట్ ఇవ్వలేదు : వాపోయిన ట్రంప్

భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని ఇప్పటికే చాలాసార్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు.. ఈ సమావేశంలోనూ ఆ అంశం గురించి మాట్లాడారు. "దానికి నాకు క్రెడిట్ వచ్చిందా..? లేదు కదా..!" అని వాపోయారు. పాక్‌తో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయమేమీ లేదని భారత్ తేల్చి చెప్పినప్పటికీ..ట్రంప్ క్రెడిట్ తీసుకోవడం మాత్రం మానడం లేదు.



## ఢిల్లీ గగనతలంపై 'సుదర్శన చక్రం'..

### కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలోని కీలక వీఐపీ-89 జోన్‌లో గగనతల భద్రత కోసం కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశీయ సమీకృత ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద దీన్ని ఏర్పాటుచేయనున్నట్లు ఆ కథనం పేర్కొంది. ఈ గగనతల రక్షణ వ్యవస్థ విలువ దాదాపు రూ.5,181 కోట్లు ఉంటుందని అంచనా. దీన్ని డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. ఇది దేశ రాజధాని చుట్టూ 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పునైనా అడ్డుకోగలదని సదరు వర్గాలు వెల్లడించాయి. సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మిలిటరీ పోరాట సామర్థ్యాలను మరింత పెంచేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోలుకు రక్షణ మంత్రిత్వశాఖ సోమవారం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే ఈ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. 'సుదర్శన్ చక్ర' పేరుతో దేశంలో కీలక ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచాన్ని, ప్రతిదాడి వ్యవస్థను మోహరించనున్నట్లు ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాముఖ్యం ఉన్న ప్రాంతాలను రక్షించడం దీని లక్ష్యం. ఇందులో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించి, వాటిని నేలకూల్చే వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. సైబర్ యుద్ధాన్ని తిప్పికొట్టే సామర్థ్యాన్ని కూడా ఈ వ్యవస్థలో అనుసంధానించనున్నారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), ప్రైవేటు సంస్థలు, సైన్యం మధ్య భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది.

## ప్రయాణికుడిపై దాడి కేసు..

### ఎయిరిండియా పైలట్ అరెస్ట్



**న్యూఢిల్లీ :** ఇందిరా గాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానాశ్రయంలో స్పైస్‌జెట్ విమాన ప్రయాణికుడిపై ఇటీవల జరిగిన దాడి కేసులో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన పైలట్ వీరేందర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన తర్వాత పైలట్‌ను అరెస్టు చేసినట్లు అదనపు పోలీసు కమిషనర్ విచిత్ర వీర్ తెలిపారు. అయితే అరెస్ట్ అయిన వెంటనే వీరేందర్‌కు బెయిల్ మంజూరైనట్లు పేర్కొన్నారు. కాగా ఈ ఘటనతో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ పైలట్‌ను ఇప్పటికే విధుల నుంచి తొలగించింది. దాడి ఘటన గురించి ప్రయాణికుడు అంకిత్ దివాన్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయగా విమానయాన సంస్థ ఈ చర్య తీసుకుంది. తన కుటుంబంతో కలిసి స్పైస్‌జెట్ విమానంలో ప్రయాణించేందుకు దిల్లీ ఎయిర్‌పోర్టుకు వచ్చానని, టెర్మినల్-1లో సెక్యూరిటీ చెక్-ఇన్ వద్ద లైన్‌లో ఉండగా... కొందరు లైన్ మధ్యలోకి రావడంపై ప్రశ్నించానని వీడియో ద్వారా అంకిత్ దివాన్ వెల్లడించారు. ప్రశ్నించినందుకు గాను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ వీరేందర్ సెజ్వాల్ దుర్భాషలాడడంతో పాటు తనపై భౌతిక దాడి చేశాడని తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటనపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాల్సిందిగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.



## ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

### పలువురి మృతి

**ఉత్తరాఖండ్ :** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారు జామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తూ లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపో యిన వారిని బయటకు తీయడం కష్టంగా మారిందన్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహత్ మీదుగా రాంనగర్‌కు వెళ్తుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు.

## బెంజి కారులో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా..

### డ్రగ్స్ రాకెట్ పట్టివేత




**న్యూఢిల్లీ :** ఎవరికీ అనుమానం రాకుండా లగ్జరీ కార్లలో హైబ్రిడ్ మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్న డ్రగ్స్ ముఠా గుట్టు రట్టయ్యింది. బెంజి కారులో డ్రగ్స్ అక్రమరవాణా చేస్తున్న రాకెట్‌ను అహ్మదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ శివార్లలో ఓ కారు నుంచి రూ.15 లక్షల విలువైన హైబ్రిడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌కు రూ.10వేలు చెల్లించి అతడి సహాయంతో కొనుగోలుదారుల వద్దకు డ్రగ్స్ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. డిసెంబర్ 31న వివిధ ఫామ్‌హౌజ్‌లలో నిర్వహించనున్న రేవ్ పార్టీల నిర్వాహకులకు ఈ మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అర్చిత్ అగర్వాల్ అనే డ్రగ్స్ సరఫరాదారు థాయిలాండ్ నుంచి హైబ్రిడ్ గంజాయిని తీసుకువచ్చి.. ఎవరికీ అనుమానం రాకుండా ఉండటానికి తన లగ్జరీ కార్లలో వీటిని అహ్మదాబాద్‌లోని పలు ప్రాంతాలకు తరలిస్తుంటాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుడు అగర్వాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

# కేజీ వెండి ధర 2.39 లక్షలు




మదుపర్ల లాభాల స్వీకరణతో రికార్డు ధరల నుంచి సోమవారం భారీగా పతనమైన బంగారం, వెండి ధరలు మంగళవారం జోరందుకున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కేజీ వెండి ధర మళ్లీ రూ.2.30 లక్షల స్థాయిని దాటగా.. 10 గ్రాముల పసిడి ధర 1.38 లక్షల పైనే పలికింది. కమోడిటీ ఎక్స్ఛేంజీల్లో వెండి మార్చి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సోమవారం రూ.2,24,855 (ఒక కిలోకి) వద్ద స్థిరపడింది. ఈ ధర మంగళవారం 4 శాతానికి పైగా పెరిగి రూ.2.34 లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేటి ఉదయం 11.45 గంటల ప్రాంతంలో కేజీ వెండి ధర రూ.2.39 లక్షలుగా ఉంది. సోమవారం ఈ ధర రూ.2.28 లక్షల వరకు పతనమైంది. ఇక, పసిడి 2026 ఫిబ్రవరి ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సోమవారం రూ.1,34,887 (10 గ్రాములకు) వద్ద ముగియగా.. నేడు 0.61శాతం పెరిగి రూ.1.35 లక్షలుగా ఉంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.38 లక్షలు పలికింది. క్రితం రోజు ధర (రూ.1.37లక్షలు)తో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.






## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, దేశీయంగా ముందుకు నడిపించే అంశాలేవీ లేకపోవడంతో సూచీలు మోస్తరు శ్రేణికే పరిమితమయ్యాయి. పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, ఆటో షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించగా.. ఐటీ, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, ఫార్మా షేర్లు అమ్మకాలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 84,600.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,695.54) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,470.94–84,806.99 మధ్య కదలాడింది. చివరికి 20.46 పాయింట్ల నష్టంతో 84,675.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 3.25 పాయింట్ల నష్టంతో 25,938.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.84గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, ఇండిగో, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.59 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4390 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# అమ్మాయిలు అదరహో..

## శ్రీలంకతో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్




**తిరువనంతపురం:** మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచి 2025ను చిరస్మరణీయం చేసుకున్న మహిళల జట్టు.. ఈ ఏడాదిని ఘనంగా ముగించింది. శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరి టీ20లో హర్మన్‌ప్రీత్ సేన.. 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 160/7కు పరిమితమైంది. ఓపెనర్ హాసిని పెరీరా (65, 42 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్ బ్యాటర్ ఇమేషా దులానీ (50, 39 బంతుల్లో 8 ఫోర్లు) అర్ధ శతకాలు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, వైష్ణవి శర్మ, అమన్‌జ్యోత్ కౌర్, శ్రీచరణి, స్నేహ్ రాణా తలో వికెట్ పడగొట్టారు.

భారత బ్యాటర్లలో హర్మన్‌ప్రీత్ కౌర్ (68, 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించింది. చివర్లో అరుంధతి రెడ్డి (27, 11 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించింది. అమన్‌జ్యోత్ (21, 18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించింది. జి.కమలిని (12), షెఫాలి వర్మ (5), రిచా ఘోష్ (5), దీప్తి శర్మ (7) నిరాశపర్చారు. ఒక దశలో భారత్ 77 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో అమన్‌జ్యోత్‌తో కలిసి హర్మన్ ప్రీత్ ఆరో వికెట్‌కు 37 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. శ్రీలంక బౌలర్లలో చమరి ఆటపట్టు, రష్మిక, కవిషా దిల్హరి రెండేసి వికెట్లు పడగొట్టగా.. నిమాషా మదుశనికి ఒక వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ పడగొట్టిన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ టీ20ల్లో కొత్త రికార్డు సృష్టించింది. ఆస్ట్రేలియా బౌలర్ మేగాన్ షట్ (151)ని అధిగమించి మహిళల టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది.



## 2025లో మదుపర్ల సంపద రూ.30 లక్షల కోట్లు పైకి..

**న్యూఢిల్లీ:** విదేశీ మదుపర్ల అమ్మకాలు, టారిఫ్‌ల ఒత్తిడులు, రూపాయి పతనం వంటి ప్రతికూలతల నడుమ దలాల్ స్ట్రీట్ మదుపర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ 8 శాతం పెరిగి మదుపర్లకు రూ.30.20 లక్షల కోట్ల ప్రతిఫలాన్ని అందించింది. దేశీయ స్థూల ఆర్థిక పరిస్థితులు, దేశీయ మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో ఇది సాధ్యమైందని అనలిస్టులు పేర్కొంటున్నారు. 2025లో డిసెంబర్ 29 వరకు బీఎస్ఈ సెన్సెక్స్ 8.39 శాతం వృద్ధితో 6,556.53 పాయింట్లు పెరిగింది. డిసెంబర్ 1న అత్యధికంగా 86,159.02 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ రికార్డు గరిష్ఠాలను అందుకుంది. డిసెంబర్ 29 వరకు బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.30 లక్షల కోట్లు (రూ.30,20,376.68) పెరిగి రూ.472 లక్షల కోట్లకు చేరింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారి బీఈఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.400 లక్షల కోట్ల మార్కును చేరుకుంది. 2024లో సెన్సెక్స్ 8.16 శాతం వృద్ధితో 5,898.75 పాయింట్లు పెరిగింది. ఆ ఏడాది బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.77.66 లక్షల కోట్లు వృద్ధి చెందింది. 2023లో బీఈఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.81.90 లక్షల కోట్లు వృద్ధి నమోదైంది. 2025లో దేశీయ ఈక్విటీ మార్కెట్‌ల నుంచి సుమారు రూ.1.6 లక్షల కోట్లను విదేశీ మదుపర్లు తరలించారు. అయినప్పటికీ దేశీయ మదుపర్ల మద్దతు, స్థిరమైన వృద్ధి, ప్రభుత్వ మూలధన వ్యయం వంటివి మన మార్కెట్‌ను నిలబెట్టాయని స్టాక్స్‌కార్ట్ సీఈఓ ప్రణయ్ అగర్వాల్ పేర్కొన్నారు. దీనికితోడు టాటా క్యాపిటల్ (రూ.15,512 కోట్లు), హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ.12,500 కోట్లు), ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా (రూ.11,607కోట్లు), హెక్సావేర్ టెక్నాలజీస్ (రూ.8,750కోట్లు), లెన్స్‌కార్ట్ (రూ.7,278 కోట్లు), గ్రో (రూ.6632 కోట్లు) వంటి ఐపీఓలు కూడా మార్కెట్స్ పెరగడానికి దోహదం చేశాయి. దీర్ఘకాలంలో మన మార్కెట్లు మెరుగైన ప్రతిఫలం ఇస్తుందన్న అంచనాలతో సిప్ ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. దీంతో రిటైల్ మదుపర్ల భాగస్వామ్యం కూడా తోడైంది.

### రిలయన్స్‌దే టాప్

2025లో అత్యధిక మార్కెట్ విలువ కలిగిన కంపెనీల జాబితాలో రిలయన్స్ అగ్రస్థానంలో నిలిచింది. రూ.20,91,173 కోట్ల మార్కెట్ విలువ దీని సొంతం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.15,25,457.75 కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ.11,86,978.75 కోట్లు), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (రూ.11,77,199.05 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.9,60,478.36 కోట్లు) టాప్–5 స్థానాల్లో నిలిచాయి.




## శుభ్‌మన్ గిల్ తిరిగి టీ20 జట్టులోకి వస్తాడు

**హర్భజన్ సింగ్**

త్వరలో ప్రారంభం కానున్న టీ20 వరల్డ్‌కప్ 2026కు సంబంధించి భారత జట్టును ఇటీవలే బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే జట్టు న్యూజిలాండ్‌తో జరగనున్న అయిదు టీ20ల సిరీస్‌లోనూ ఆడనుంది. అనూహ్యంగా శుభ్‌మన్ గిల్ తన వైస్ కెప్టెన్సీతో పాటు, జట్టులో స్థానాన్నీ కోల్పోయాడు. సెలక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే గిల్ టీ20 మ్యాచుల్లో వరుసగా వైఫల్యమవుతున్నందున బీసీసీఐ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్.. శుభ్‌మన్ గిల్‌కు మద్దతుగా నిలిచాడు. అతడు కచ్చితంగా తిరిగి టీ20 జట్టులోకి వస్తాడని ఆశాభావం వ్యక్తంచేశాడు. 'టీమ్‌ఇండియాకు ఎంపిక విషయంలో తీవ్రమైన పోటీ ఉన్న విషయం వాస్తవమే. అయితే గిల్‌కు దారులన్నీ మూసుకుపోయినట్లు కాదు. అతడు తిరిగి టీ20 జట్టులోకి వస్తాడు. శుభ్‌మన్ గిల్ అద్భుతమైన ఆటగాడు. అతడు కచ్చితంగా పునరాగమనం చేస్తాడు. అలాగే గిల్ టెస్ట్ కెప్టెన్ అన్న విషయం మరిచిపోకూడదు.' అని హర్భజన్ సింగ్ అన్నాడు. 'కాంబినేషన్ వల్ల గిల్‌కు టీ20 జట్టులో చోటు దక్కలేదని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వివరణ ఇచ్చారు. పరిస్థితులు, కాంబినేషన్ వల్లే వాళ్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. గిల్ ఒక క్లాస్ ప్లేయర్. అతడు జట్టులోకి తిరిగి వస్తాడన్న విషయంలో నాకు ఎలాంటి అనుమానం లేదు' అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్.. రాబిన్ ఉతప్ప సైతం ఇటీవల తన యూట్యూబ్ ఛానల్ వేదికగా శుభ్‌మన్ గిల్ టీ20 వరల్డ్‌కప్‌నకు ఎంపిక కాకపోవడం గురించి మాట్లాడాడు. 'వరల్డ్ కప్ నేపథ్యంలో జట్టులో ఫామ్‌లో లేని ఒక్క ఆటగాడిని మాత్రమే కొనసాగించవచ్చు. అంతకంటే ఎక్కువమందిని తీసుకోలేం. సూర్యకుమార్‌యాదవ్ ఈ మధ్య అంతగా పరుగులు చేయడం లేదు. అందుకే శుభ్‌మన్ గిల్ జట్టులో స్థానం కోల్పోవాల్సి వచ్చిందని నా అభిప్రాయం' అని ఉతప్ప అన్నాడు.

## అతడు టెస్ట్‌లు ఆడతానంటే.. బీసీసీఐ వద్దంటుందా?

**రాబిన్ ఉతప్ప**




హార్దిక్ పాండ్య టెస్ట్ క్రికెట్‌పై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప కీలక వ్యాఖ్యలు చేశాడు. అతడికి టెస్ట్ జట్టులో పునరాగమనం చేసే సత్తా ఉందని అభిప్రాయపడ్డాడు. ఒకవేళ అదే జరిగితే ఆ ఆల్‌రౌండర్‌కు నం.7వ స్థానం సరిగ్గా సరిపోతుందన్నాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యకు ఉన్న ఫిట్‌నెస్.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను సరిగా నిర్వహిస్తే, టెస్ట్ క్రికెట్ ఆడేందుకు సరిపోతుందని ఉతప్ప తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అభిప్రాయపడ్డాడు. "ఒకవేళ హార్దిక్ పాండ్య టెస్ట్ క్రికెట్‌లో పునరాగమనం చేస్తే.. నం.7వ స్థానం అద్భుతంగా సరిపోతుంది. ప్రస్తుతం అతడు ఆడుతున్న విధానాన్ని చూస్తే.. ఏదైనా జరగొచ్చు అనిపిస్తోంది. ఎందుకంటే ఇది క్రికెట్. హార్దిక్ పాండ్య టెస్ట్ క్రికెట్ ఆడాలని నిశ్చయించుకుంటే.. బీసీసీఐ అతడికి అడ్డు చెబుతుందా? 'నేను ఆడతాను.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను సాధిస్తాను' అని అతడు అంటే బీసీసీఐ నో చెబుతుందనైతే నేను అనుకోను' అని రాబిన్ ఉతప్ప విశ్లేషించాడు. అలాగే ప్రస్తుతం టీమ్‌ఇండియాలో టెస్ట్ క్రికెట్‌లో ఆల్‌రౌండర్ల మీద అంత ఒత్తిడి లేదని ఉతప్ప అన్నాడు. 'ఆల్ రౌండర్లు 20 ఓవర్లు బౌలింగ్ చేస్తున్నారా? నితీశ్‌కుమార్ రెడ్డి అయితే అన్ని ఓవర్లు బౌలింగ్ చేయడం లేదు. అతడు దాదాపు 12 ఓవర్ల వరకు బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతమున్న ఫిట్‌నెస్ ప్రకారం చూసుకుంటే హార్దిక్ పాండ్య ఒక ఇన్నింగ్స్‌లో 12 నుంచి 15 ఓవర్లపాటు బౌలింగ్ వేయగలడు. అయితే ఈ విషయమై అతడే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది' అని రాబిన్ ఉతప్ప అన్నాడు. హార్దిక్ పాండ్య చివరిసారిగా 2018లో టెస్ట్, ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. వెన్నుముక గాయం తర్వాత అతడు రెడ్ బాల్ క్రికెట్‌కు దూరమయ్యాడు. అప్పటినుంచి పాండ్య కేవలం వైట్‌బాల్ క్రికెట్ మీదే తన దృష్టి పెట్టాడు.

## అతడే.. బౌలర్ ఆఫ్ ది ఇయర్: అశ్విన్



టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన దృష్టిలో బౌలర్ ఆఫ్ ది ఇయర్ ఎవరో చెప్పేశాడు. ఈ విషయంలో వరుణ్ చక్రవర్తికే అతడు ఓటు వేశాడు. తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అశ్విన్ ఈ మేరకు విశ్లేషించాడు. 'నా దృష్టిలో వరుణ్ చక్రవర్తి టీమ్‌ఇండియాకు బౌలర్ ఆఫ్ ది ఇయర్. అతడు జట్టుకు ఒక ఎక్స్ ఫ్యాక్టర్. టీమ్‌ఇండియా టీ20 వరల్డ్‌కప్ 2026 సాధించడంలో వరుణ్ కీలకపాత్ర పోషించబోతున్నాడు. ముఖ్యంగా అతడు టీ20 స్పెషలిస్ట్ బౌలర్' అని అశ్విన్ అన్నాడు. వరుణ్ చక్రవర్తి ఒకానొక దశలో జట్టుకు దూరమై.. తిరిగి బలంగా తిరిగొచ్చిన అంశాన్నీ అశ్వి న్ ప్రస్తావించాడు. 'అతడు జట్టులో చోటు కోల్పోయినప్పుడు పుంజుకొని కమ్ బ్యాక్ ఇచ్చాడు. ప్రస్తుతం అతడు టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్‌లో ఉన్నాడు. నిజానికి అతడో ఆర్కిటెక్ట్. క్రికెట్ అతడి మొదటి ప్రొఫెషన్ కాదు. అతడు మొదట చెన్నైలో అయిదో డివిజన్‌లో బౌలింగ్ చేశాడు. తర్వాత నెట్ బౌలర్‌గా వచ్చాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో అద్భుతంగా బంతులు సంధించాడు' అని అతడి క్రికెట్ ప్రయాణాన్ని అశ్విన్ గుర్తు చేశాడు. అలాగే టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మను కూడా అశ్విన్ కొనియాడాడు. '2025లో అభిషేక్ శర్మ బ్యాట్‌తో అద్భుతంగా రాణించాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో చక్కగా పరుగులు రాబట్టాడు. అతన్ని వన్డే ఫార్మాట్లో కూడా చూడాలని ఉంది. రెడ్‌బాల్ క్రికెట్‌లోనూ అతన్ని పరీక్షించొచ్చు. అతడు ఈ సంవత్సరానికి సంబంధించి అత్యుత్తమ బ్యాటర్' అని అశ్విన్ కితాబిచ్చాడు. అలాగే రో–కో జోడీ గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'వారు రానున్న వన్డే వరల్డ్‌కప్ గెలవాలన్న ఆశయంతో ఉన్నారు. దాన్ని సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. వారి ఆటను మనమంతా ఆస్వాదిస్తున్నాం' అని పేర్కొన్నాడు.

## ఆర్థిక పథకాలు, సేవల అమ్మకాలకు త్వరలో మార్గదర్శకాలు




**ముంబయి:** తప్పుడు /అసమగ్ర సమాచారంతో వినియోగదార్లను తప్పుదారి పట్టిస్తూ.. వేర్వేరు ఆర్థిక పథకాలు, సేవలను విక్రయిస్తుండటాన్ని నివారించడంపై రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) దృష్టి సారించింది. ఇందుకోసం వ్యాపార ప్రకటనలు, మార్కెటింగ్– విక్రయాలకు సంబంధించి ఆయా సంస్థలకు విస్తృత స్థాయి నిబంధనలను ఆర్‌బీఐ జారీ చేయనుంది. కొంతమంది ఇలా 'తప్పుడు మార్గాల్లో ఆయా ఉత్పత్తులు విక్రయించడం (మిస్‌సెల్లింగ్) వల్ల వినియోగదార్లపై, ఆర్థిక రంగంపైనా ప్రభావం పడుతోందని ఆర్‌బీఐ వివరించింది. రికవరీ ఏజెంట్లు, రుణ రికవరీ వంటి అంశాలకు సంబంధించిన నిబంధనలను సమీక్షించి, సవరించనున్నట్లు తెలిపింది. డిజిటల్ మోసాలను అరికట్టేందుకు హోం వ్యవహారాల శాఖ సహా పలు వర్గాలతో కలిసి పనిచేయనున్నట్లు వివరించింది. డిజిటల్, సైబర్ మోసాలను అదుపు చేసేందుకు పలు చర్యలను చేపట్టనున్నట్లూ పేర్కొంది. ఆర్థిక సంస్థలు అంతర్గతంగా బలమైన చర్యలు చేపట్టాలని, అన్ని స్థాయుల్లో ఫిర్యాదు పరిష్కార అధికారులు తగిన సంఖ్యలో ఉండేలా చూసుకోవాలని, డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతనూ పెంచాలని సూచించింది. మ్యూల్ ఖాతాల ద్వారా జరుగుతున్న మోసాలను నిలువరించేందుకు ఆర్‌బీఐ మ్యూల్‌హంటర్.ఏఐని అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే.

ఆదాబ్ రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'.. చైనాకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్..



బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'పై చైనా మీడియా వెళ్లగక్కిన అక్కసుకు భారత్ గట్టిగా బదులిచ్చింది. సినిమాలను తెరకెక్కించే విషయంలో దర్శకనిర్మాతలకు కళాత్మక స్వేచ్ఛ ఉంటుందన్న విషయాన్ని పొరుగు దేశానికి గుర్తు చేసింది. "భారత్‌లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. తమ భావాలను కథల రూపంలో వ్యక్తపర్చడం కూడా ఇందులో అంతర్భాగమే. కళాత్మక స్వేచ్ఛకు అనుగుణంగా సినిమాలను తెరకెక్కించే హక్కు దర్శకనిర్మాతలకు ఉంటుంది. ఈ సినిమా (బ్యాటిల్ ఆఫ్ గల్వాన్) విషయంలో ఎవరికైనా (చైనాను ఉద్దేశిస్తూ) సందేహాలు గానీ, ఆందోళన గానీ ఉంటే.. స్పష్టత కోసం భారత రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించొచ్చు. ఈ చిత్రం విషయంలో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదు" అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ సినిమాపై చైనా అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' అక్కసు వెళ్లగక్కిన విషయం తెలిసిందే. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ నోరుపారేసుకుంది. ఈ చిత్రం జాతీయవాద మెలోడ్రామా అని ఆరోపించిన చైనా.. గల్వాన్‌లో ఘర్షణలకు భారత బలగాలే కారణమంటూ సమర్థించుకునే ప్రయత్నం చేసింది. 2020 జూన్‌లో భారత్–చైనా సరిహద్దుల్లోని గల్వాన్ ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్‌కు చెందిన 20 మంది సైనికులు వీరమరణం పొందారు. ఈ సంఘటన ఆధారంగానే 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమా తెరకెక్కుతోంది. ఇటీవల సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకుని టీజర్ విడుదల చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో సినిమా విడుదల కానుంది.



ఈ సంక్రాంతికి రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ఆడియన్స్‌ను కచ్చితంగా అలరిస్తాడని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రమిది. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నేడు మూడో పాటను రిలీజ్ చేయనున్నారు. గుంటూరులో ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో అనిల్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

# దిష్టి తీయించుకోమని చిరంజీవికి చెప్పా

## అనిల్ రావిపూడి

"చిరంజీవిలో ఉన్న కామెడీ టైమింగ్ మరోసారి తెరపై చూస్తారు. ఆయన ఈ చిత్రం కోసం ఎంతో శ్రమపడి లుక్ మార్చుకున్నారు. చూసినవారంతా చరణ్‌కు తమ్ముడా అని అడుగుతున్నారు. ఈ సినిమాకు ఆయన లుక్ అలా రావడం నా అదృష్టం. ఇండస్ట్రీకి చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ, నాగార్జున నాలుగు మూలస్తంభాలు. వీరిలో ఏ ఇద్దరు కలిసి నటించినా అది గొప్పగా ఉంటుంది. 'మన శంకరవరప్రసాద్ గారు'లో వెంకటేశ్, చిరంజీవి కలిసి సందడి చేస్తారు" అని చెప్పారు.

**చిరంజీవి లుక్ గురించి చెప్పండి?**

అనిల్ రావిపూడి: ఈ సినిమాలో కొత్తగా కనిపించడం కోసం చిరంజీవి పడిన శ్రమ తెరపై అందరికీ కనిపిస్తుంది. సెట్‌లో అందరూ ఆయన యూత్‌ఫుల్‌గా ఉ న్నారని చెబుతుండేవారు. అందుకే రోజూ దిష్టి తీయించుకోండి అని చిరంజీవికి చెప్పాను.

**ఈ సంక్రాంతికి చాలా సినిమాలు వస్తున్నాయి కదా?ఏం చెబుతారు?**

అనిల్ రావిపూడి: సంక్రాంతి అంటేనే సినిమాల పండగ. ఈసారి 'రాజాసాబ్'తో సందడి మొదలవుతుంది. దానికోసం నేను కూడా ఎదురుచూస్తున్నా. వాళ్లు ప్రారంభించిన పండగ సందడిని మేం కొనసాగిస్తాం.

**రివ్యూలపై మీ అభిప్రాయం ఏంటి?**

అనిల్ రావిపూడి: సినిమాను ఆదరించాలా, లేదా అనేది ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది. రివ్యూలు వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. వాళ్లను నేను ఎప్పుడూ తప్పు పట్టను. ప్రేక్షకులను అలరించడమే నా లక్ష్యం.

సోషల్ మీడియాలో వచ్చే ట్రోలింగ్స్‌ను ఎలా చూస్తారు?

అనిల్ రావిపూడి: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఫ్యాన్ వార్‌లు సాధారణం అయ్యాయి. ఏ హీరో సినిమా విడుదలైనా అవి జరుగుతూనే ఉంటాయి. అందుకే ట్రోల్ చేస్తుంటారు. వాటికి మనం స్పందించకుండా ఉంటే బాగుంటుంది. ఒకప్పుడు మనం అందరి చిత్రాలను ఆదరించాం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సోషల్ మీడియా వాడకం ఎక్కువయ్యాక ఈ ట్రోలింగ్ ఎక్కువైంది.

శివాజీ కామెంట్స్‌పై మీరేమంటారు?

అనిల్ రావిపూడి: ఆ కామెంట్స్ సున్నితమైన అంశానికి సంబంధించినవి. అందరూ దాని గురించి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. నేను ఒకటి చెబితే అది నచ్చనివాళ్లు నాపై దాడి చేస్తారు. ఇలాంటి విషయాల్లో ఎవరి అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయి. నా పని నేను చేసుకుంటూపోతుంటాను. ఎవరైనా నా వల్ల బాధ పడితే వాళ్లకు సారీ చెప్పి ముందుకుపోవడం నా మనస్తత్వం. ఎవరికి నచ్చినట్లు వాళ్లు జీవించడంలో తప్పు లేదు. ఇండస్ట్రీలో జరిగే అన్ని విషయాలపై స్పందించి మన అభిప్రాయాలు చెప్పడం సరైన పద్ధతి కాదు.

**రాజాసాబ్ ఈవెంట్‌లో ప్రభాస్ స్టేట్‌మెంట్ మీకు ఎలా అనిపించింది?**

అనిల్ రావిపూడి: 'పెద్ద హీరోల తర్వాతే మేము' అని అనడం ప్రభాస్ గొప్పతనానికి నిదర్శనం. అలా ఆలోచిస్తారు కాబట్టే ఆయన ఈరోజు పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. మేమందరం 'రాజాసాబ్'ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉ న్నాం.

## రిద్ధికి ప్రభాస్

# శారీ ఎందుకు గిఫ్ట్ ఇచ్చారు?

అసలు విషయమిదే..



ఇటీవల జరిగిన 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నటి రిద్ధి కుమార్ స్పీచ్ వైరలైన విషయం తెలిసిందే. తనకు ప్రభాస్ ఓ చీరను గిఫ్ట్‌గా ఇచ్చారని.. ఆ చీర కట్టుకోవడం కోసం తాను మూడేళ్లు వేచి చూసినట్లు తెలిపారు. ఈ ఈవెంట్‌కు కట్టుకొచ్చినట్లు చెప్పారు. దీంతో ప్రభాస్ ఆమెకు శారీ ఎందుకు గిఫ్ట్ ఇచ్చారని రకరకాల కామెంట్స్ వినిపించాయి. తాజాగా రిద్ధి ఒక ఇంటర్వ్యూలో దాని గురించి స్పందించారు. తాను ప్రభాస్ పుట్టినరోజుకు గిఫ్ట్ ఇవ్వగా రిటర్న్ గిఫ్ట్‌గా తనకు శారీ ఇచ్చినట్లు తెలిపారు. "నేను రాజాసాబ్ సెట్‌కు వెళ్లిన మొదటిరోజు ప్రభాస్ పుట్టినరోజు. గిఫ్ట్ ఇవ్వాలి అనుకున్నాను. తర్వాత చిత్రబృందం దీపావళి పార్టీ ఏర్పాటుచేసింది. అక్కడ కర్ణుడి కథకు సంబంధించిన పుస్తకం ఆయనకు బహుమతిగా ఇచ్చాను. నిజజీవితంలో ప్రభాస్ స్వభావం కర్ణుడిని పోలి ఉంటుంది. అందుకే ఆయనకు ఆ బహుమతి ఇచ్చాను. ఆ తర్వాత 'కల్కి 2898 ఏడీ' సినిమాలో ఆయన కర్ణుడిగా నటించాడని తెలిసి ఆశ్చర్యపోయా. ఆ పుస్తకానికి రిటర్న్ గిఫ్ట్‌గా నాకు హనుమాన్‌చాలీసా బుక్, చాక్లెట్స్ ఇచ్చారు. వాటి పక్కనే బ్యూటిఫుల్ వైట్ శారీ ఉండడం చూసి ఎమోషనల్ అయ్యాను. ఆ హనుమాన్ చాలీసా పుస్తకం ఆరోజు నుంచి నా బ్యాగ్‌లోనే ఉంది" అని చెప్పారు. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు, వీడియోలు సినిమాపై అంచనాలు పెంచాయి.

## రోజూ వ్యాయామమే

# ఫిట్‌నెస్ రహస్యం

## వందో సినిమాపై నాగ్ ప్రత్యేక దృష్టి



టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలు ఉన్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మథుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జునే. 66 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా కనిపిస్తూ యంగ్ హీరోలకు పోటీనిస్తుంటారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ సీక్రెట్ పంచుకున్నారు. తాను ఎప్పుడూ కడుపు మాడ్చుకొని డైటింగ్ చేయలేదు. వేళకు తింటాను. దానితో పాటు ం లో జూ కచ్చితంగా ఉదయం వ్యాయామం చేస్తాను. ఇప్పటికి 45 ఏ ళ్లుగా నేను జిమ్ చేస్తున్నాను. ఏరోజూ కూడా మిస్ అవలేదు. ఎప్పుడైనా ఆరోగ్యం బాలేక.. వెళ్లలేని పరిస్థితుల్లో ఉ ంటే తప్ప మిగతా రోజుల్లో కచ్చితంగా జిమ్‌కు వెళ్తా. అన్నిటికంటే ముఖ్యంగా నేను ఏ విషయాన్నైనా పాజిటివ్‌గా తీసుకుంటాను. ఎలాంటి సమస్య అయినా నన్ను నేను నిరుత్సాహపరుచుకోను అని చెప్పారు. ఇక 2025 గురించి నాగార్జున మాట్లాడుతూ తాను ఈ ఏడాది ఎంతో ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్‌గానూ చాలా సంతోషంగా ఉ న్నానన్నారు. ఇంతకుమించి తానేం కోరుకోవడం లేదన్నారు. ఈ సంవత్సరం అఖిల్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారని.. అలాగే నాగచైతన్య– శోభిత ఒక్కటై ఏడాది పూర్తయిందన్నారు. వాళ్లను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉ ందన్నారు. నాగార్జున కెరీర్ విషయానికొస్తే.. ఈ ఏడాదిలో ఆయన రెండు సినిమాల్లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'కూలీ'లో ఆయన నటించిన సైమన్ పాత్రకు మంచి ఆదరణ సొంతమైంది. అలాగే కుబేరలో మాజీ సీబీఐ అధికారి దీపక్‌తేజ్‌గా కనిపించి మెప్పించారు. ప్రస్తుతం తన 100వ సినిమా పనుల్లో నాగార్జున బిజీగా ఉన్నారు. అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాగార్జున, ఆ తర్వాత తనకంటూ ప్రత్యేకమైన శైలితో స్టార్ హీరోగా ఎదిగారు. రొమాంటిక్ హీరోగా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, యాక్షన్, మాస్, భక్తిరస చిత్రాల వరకు అన్ని జానర్లలో నటిస్తూ ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకున్న నాగ్ ఇప్పుడు తన కెరీర్‌లో అత్యంత కీలకమైన 100వ సినిమాతో బిజీగా ఉ న్నారు. 'నా సామిరంగ' సినిమా తర్వాత వెంటనే 100వ సినిమా మొదలుపెట్టాల్సి ఉన్నా, ఇది మైలురాయి చిత్రం కావడంతో నాగార్జున ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాస్త ఆలస్యం చేశారు. అయితే ఈ గ్యాప్‌లో ఆయన ఖాళీగా మాత్రం లేరు. ఇతర హీరోల సినిమాల్లో కీలక పాత్రలు, విలన్ రోల్స్ చేయడంతో పాటు బిగ్ బాస్ లాంటి షోలతో కూడా ఆడియన్స్‌కు ఎప్పటికప్పుడు దగ్గరగానే ఉన్నారు. ఇప్పుడు 100వ సినిమా విషయంలో పూర్తిగా ఎ÷–లాన్‌తో ముందుకు వెళ్తున్నారు. ఈ మైలురాయి చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ కేరళలో జరగనున్నట్లు సమాచారం.

# ఓటీటీలోకి 'బ్యూటీ'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే



అంకిత్ కొయ్య, నీలఖి ప్రధానపాత్రల్లో తెరకెక్కిన 'బ్యూటీ'. మారుతి నిర్మించిన ఈ సినిమాకు జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జీ5 వేదికగా జనవరి 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. నారాయణ (నరేశ్)ది మధ్యతరగతి కుటుంబం. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంటాడు. తనకు కూతురు అలేఖ్య (నీలఖి) అంటే పంచ ప్రాణాలు. ఆమె అడిగింది కాదనకుండా కొనిస్తూ.. అందులోనే తన ఆనందాన్ని వెతుక్కుంటుంటాడు. ఇంటర్ చదివే నీలఖికి అనుకోకుండా పెట్ ట్రైనర్ అర్జున్ (అంకిత్)తో పరిచయం ఏర్పడుతుంది. కొంతకాలానికి ఆ పరిచయం ప్రేమగా మారుతుంది. ఓ రోజు అలేఖ్య.. అర్జున్‌తో అసభ్యకరంగా వీడియో కాల్ మాట్లాడుతు ండగా ఆమె తల్లి (వాసుకి) చూస్తుంది. దీంతో, ఆమె చేయి చేసుకోగా అలేఖ్య కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోతుంది. అర్జున్ ఆమెను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లడంతో.. వీళ్లిద్దర్నీ వెతుక్కుంటూ నారాయణ కూడా వెళతాడు. వీళ్లంతా హైదరాబాద్ చేరుకున్నాక ఏం జరిగింది? ఈ ప్రేమ జంటకు.. ఆ నేర ముఠాతో విరోధమేంటి? వీళ్ల విషయంలో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది? నారాయణ కు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? కూతుర్ని కలుసుకున్నాడా? అన్నది మిగతా కథ.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com